




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 240 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 7 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 240 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 7 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారీ యూనిట్..
# మే 8న మంత్రి లోకేశ్ భూమిపూజ

- రూ.5001 కోట్లతో ఎల్జీ ప్లాంట్... 2000 ఉద్యోగాలు
- ఆరేళ్లలో దశలవారీగా యూనిట్ నిర్మాణం, రూ.839 కోట్లతో 5 అనుబంధ పరిశ్రమలు
- ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన దిశగా మరో కీలక ముందడుగు పడనుంది. అంతర్జాతీయ గృహోపకరణాల తయారీ దిగ్గజం ఎల్జీ ఎలక్ట్రానిక్స్, తిరుపతి సమీపంలోని శ్రీసిటీలో భారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ నూతన ప్లాంట్‌కు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ మే 8న భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాబోయే ఆరేళ్లలో వివిధ దశల్లో మొత్తం రూ.5,001 కోట్ల పెట్టుబడి పెట్టాలని, తద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎల్జీ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఎల్జీ సంస్థ శ్రీసిటీలో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌లో ప్రధానంగా ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కండీషనర్‌లతో పాటు ఇతర అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేయనుంది. అంతేకాకుండా, ఉత్పత్తులకు అవసరమైన కంప్రెసర్, మోటార్ కంప్రెసర్, హీట్ ఎక్స్ఛేంజర్ వంటి కీలక విడిభాగాలను కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే తయారుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధాన యూనిట్‌తో పాటు, రూ.839 కోట్ల వ్యయంతో మరో ఐదు అనుబంధ యూనిట్లను కూడా రానున్న ఆరేళ్లలో నెలకొల్పనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ లో ఎల్జీ కంపెనీ ప్రతినిధుల బృందంతో మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, రాయలసీమను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలను వారికి వివరించారు. ప్రభుత్వ చొరవ, కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సానుకూలంగా స్పందించిన ఎల్జీ ఎలక్ట్రానిక్స్, రాష్ట్రంలో తమ యూనిట్‌ను స్థాపించేందుకు ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు, రాయితీలను కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ప్రభుత్వం మంజూరు చేయడం విశేషం. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, గత 11 నెలల్లో వివిధ సంస్థలతో సుమారు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) కుదిరినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆర్సెలర్ మిట్టల్, బీపీసీఎల్, టీసీఎస్, ఎన్టీపీసీ, టాటా పవర్, రిలయన్స్ సీబీజీ ప్లాంట్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించాయి. ఇటీవల



వివరాలు 2లో..



గాలి జనార్దన్ రెడ్డి సహా దోషులందరికీ
# 7 ఏళ్ల జైలు శిక్ష

ఓబులాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డి దోషి: సబిత ఇంద్రారెడ్డి నిర్దోషి

- ఓబులాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు
- గాలి జనార్దన్‌రెడ్డి సహా ఐదుగురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలకు విముక్తి
- 15 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం వెలువడిన తీర్పు

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమాల కేసుకు సంబంధించి నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తన తుది తీర్పును వెలువరించింది. సుమారు 15 సంవత్సరాల సుదీర్ఘ విచారణ ప్రక్రియ అనంతరం న్యాయస్థానం ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గాలి జనార్ధన్‌రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి (ఓఎంసీ ఎండీ), గాలి జనార్ధన్‌రెడ్డి వ్యక్తిగత

వివరాలు 2లో..

శ్రీవారి మెట్టు మార్గంలో
## భక్తులకు మరిన్ని సౌకర్యాలు

- శ్రీవారి మెట్టు మార్గంలో భక్తుల ఇబ్బందులపై టీటీడీ ఈవో శ్యామలరావు క్షేత్రస్థాయి తనిఖీ
- టోకెన్ల జారీలో అసౌకర్యం, ఆటో డ్రైవర్ల తీరుపై ప్రధానంగా దృష్టి సారించిన ఈవో
- భక్తులకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని ఈవో స్పష్టీకరణ
- తిరుపతి నుంచి శ్రీవారి మెట్టుకు బస్సుల సంఖ్య, టోకెన్ కౌంటర్ల పెంపు పరిశీలన
- సౌకర్యాల మెరుగుదలకు భక్తుల నుంచి అభిప్రాయ సేకరణకు నిర్ణయం



**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవారిని కాలినడకన దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం శ్రీవారి మెట్టు మార్గంలో వసతులను మరింతగా మెరుగుపరుస్తామని టీటీడీ ఈవో జె. శ్యామలరావు భరోసా ఇచ్చారు. ఈ మార్గంలో దివ్యదర్శనం టోకెన్లు పొందేందుకు భక్తులు పడుతున్న ఇబ్బందులు, ఆటో డ్రైవర్ల నుంచి ఎదురవుతున్న అసౌకర్యంపై అందిన సమాచారం మేరకు ఆయన నేడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. ఈ తనిఖీలలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మం కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో శ్యామల రావు మాట్లాడుతూ, శ్రీవారి మెట్టు మార్గంలో టోకెన్ల కోసం భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆటో డ్రైవర్ల నుంచి కూడా సరైన సహకారం లభించడం లేదని, వారు టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలను

వివరాలు 2లో..

## ఉగ్రదాడి గురించి మోదీకి 3 రోజుల ముందే తెలుసు..
### అందుకే కశ్మీర్ పర్యటన రద్దు చేసుకున్నారు

- ఇంటెలిజెన్స్ నివేదిక అందినప్పుడు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ఖర్గే
- ఖర్గే వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన బీజేపీ
- ఖర్గేని ఆధునిక మీర్ జాఫర్ గా అభివర్ణించిన కేశవన్



వివరాలు 2లో..

## పహల్గామ్‌పై అంతకుమించి
# ఏమీ ఉండదు..!




- ఐరాస భద్రతా మండలి సమావేశంపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు
- భారత్-పాక్ ఉద్రిక్తతలపై ఐరాస భద్రతా మండలి రహస్య భేటీ
- సమావేశం ఫలితంపై కాంగ్రెస్ నేత శశి థరూర్ విశ్లేషణ
- నిర్దిష్ట తీర్మానాలేవీ ఆమోదం పొందవని అంచనా
- చైనా, ఇతర దేశాల వైఖరే ఇందుకు కారణమని వెల్లడి

వివరాలు 2లో..

## రోడ్డు యాక్సిడెంట్ బాధితులకు ఫ్రీ ట్రీట్మెంట్..
### రూ.లక్షన్నర వరకు క్యాష్ లెస్..

- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం... నేటి నుంచి అమలు
- రోడ్డు ప్రమాద బాధితులకు కేంద్రం చేయూత
- కేంద్ర రహదారుల రవాణాశాఖ నోటిఫికేషన్
- గరిష్ఠంగా ఏడు రోజుల పాటు ఉచిత చికిత్స

వివరాలు 2లో..



మాకేదన్నా జరిగితే అక్కడ
## ఎవరూ మిగలరు
### పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలు

- భారత్‌పై పాక్ రక్షణ మంత్రి తీవ్ర వ్యాఖ్యలు
- దాడి చేస్తే చరిత్రలో నిలిచిపోయే జవాబు చెబుతామన్న ఆసిఫ్
- మోదీని నెతన్యాహుతో పోలుస్తూ విమర్శలు



**పెన్ పవర్ డెస్క్:**భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతున్న నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ దేశ భద్రతకు ఏమాత్రం ముప్పు వాటిల్లినా, లేదా భారత్ తమపై దాడికి పాల్పడినా చరిత్రలో నిలిచిపోయేలా తీవ్రంగా ప్రతిస్పందిస్తామని, ఆ తర్వాత ఎవరూ మిగలరని

వివరాలు 2లో..

## దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతి

- చంద్రబాబు, పవన్ కృషితో స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమన్న శ్రీదేవి
- అమరావతి 2.0 కింద 17 కీలక ప్రాజెక్టు సాకారమవుతున్నాయని వెల్లడి
- జగన్ పాలనలో అమరావతి విధ్వంసం, దోపిడీ జరిగిందని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ రాజధాని అమరావతి దేశంలోనే అత్యుత్తమంగా రూపుదిద్దుకోనుందని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి ధీమా వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇవాళ ఏర్పాటు చేసిన

వివరాలు 2లో..



## గంటా శ్రీనివాస్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు తప్పిన ప్రమాదం

- కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపన సభా వేదిక కూలిన ఘటన
- ఫోటోల కోసం కార్యకర్తలు, స్థానికులు ఎగబడటంతో అపశ్రుతి
- మంత్రి, ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్న వైనం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, భీమిలి శాసన సభ్యుడు గంటా శ్రీనివాసరావు విశాఖపట్నం జిల్లాలో జరిగిన ఒక ప్రమాదంలో సురక్షితంగా బయటపడ్డారు. పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో



వివరాలు 2లో..

## లండన్ లో తీవ్రంగా గాయపడ్డ సుజనా చౌదరి... హైదరాబాద్ తరలింపు

- లండన్ లో బాత్రూమ్ లో జారిపడ్డ సుజనా చౌదరి
- అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ కు తరలింపు
- ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుజనా చౌదరి

వివరాలు 2లో..



## మాక్ డ్రిల్... మూడు కేటగిరీలుగా విభజన...
# రెండో కేటగిరీలో హైదరాబాద్, వైజాగ్

- నేడు దేశ వ్యాప్తంగా 244 జిల్లాల్లో సివిల్ మాక్ డ్రిల్
- డిఫెన్స్, అణు విద్యుత్ కేంద్రాలు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి
- కీలక సమీక్ష నిర్వహించిన కేంద్ర హెూంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్

**పెన్ పవర్ డెస్క్:**పహెల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అత్యవసర సమయాల్లో పౌరులు ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించి, వారిని సమాయత్తపరిచేందుకు దేశవ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రేపు ఈ కసరత్తు జరగనుంది. ఇందుకు సంబంధించి

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# ముందస్తు సూచనలేనా?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవాలు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితిని ప్రజల ముందు ఉంచుతున్నారు. ఒకరకంగా ప్రజలకు ఉన్న పరిస్థితి చెప్పి తాను ఏం చేయాలో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తీలు కట్టడానికే ఎక్కువ నిధులు ఖర్చు పెట్టాల్సి వస్తుందని అన్నారు. జీతభత్యాలు చెల్లించాలి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పింఛను చెల్లించాలి. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించి వెళ్లిందని, తాము వాటిని సెట్ చేయడం సవాల్ గా మారిందని చెబుతూనే మరొక వైపు తాను ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలా? వద్దా? అని ప్రశ్నిస్తున్నారు. అంటే ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితి తనను ఎంత మాత్రం ముందుకు అడుగు కూడా పడనివ్వడం లేదన్నారు.

కాళ్లకు అడ్డంపడే వారు.

దీంతో పాటు ప్రతి సంక్షేమ పథకం అమలు చేయాలంటే సంక్లిష్టంగానే మారింది. ఇక్కడ కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండటంతో సహకారం అందడంలోనూ అనుమానమే. అనుమానమే కాదు.. ఎలాంటి సాయం రాదు. మరొక వైపు భూములు విక్రయించి పథకాలను అమలు చేయడంతో పాటు ప్రధాన సమస్యలను తీర్చాలన్నా కాళ్లకు అడ్డం పడే వారు ఎక్కువయ్యారు. బీఆర్ఎస్ కోరుకునేది అదే. కేసీఆర్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో కాంగ్రెస్ ఫెయిల్.. ఫెయిల్ అంటూ చేసిన నినాదం వెనక ఇదేనని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఫెయిల్ అనే ముద్ర వేయడానికి కారు పార్టీ ప్రయత్నం చేస్తుంది. ప్రజలు కూడా దానిని విశ్వసించే అవకాశముంది.

సంక్షేమ పథకాలను ...

అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. మరొక వైపు సంక్షేమ పథకాలు ఏవీ ఆపడం లేదు. పైగా సన్న బియ్యం వంటి పథకాలను కూడా ప్రవేశపెట్టి మరింత ఆర్థిక భారాన్ని ఖజానాపై మోపుతున్నారు. ఈ నేపథ్యంలోనే సహజంగా ఉద్యోగులు తమ డిమాండ్లను కూడా నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. అందులో భాగంగానే ఆర్టీసీ కార్మికుల సమ్మె కు నోటీసులు ఇచ్చారు. వారు విరమించుకున్నా తాత్కాలిక వాయిదాననే ప్రకటించారుక. భవిష్యత్ లో ఉద్యోగ సంఘాలు కూడా ఆందోళనకు దిగే అవకాశముంది. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మిగిలిన హామీలను కూడా అమలు చేయాలని విపక్ష పార్టీల నుంచి వత్తిడి ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే ముందు జాగ్రత్త చర్యగా రేవంత్ రెడ్డి ప్రజలతో పాటు వివిధ ఉద్యోగ సంఘాలకు కూడా వాస్తవ పరిస్థితులను చెబుతున్నారు. మరి ప్రజలు ఏ రకంగా దీనిని స్వీకరిస్తారన్నది చూడాలి. ం

## మాకేదన్నా జరిగితే అక్కడ ఎవరూ మిగలరు

- మొదటి పేజీ తరువాయి

ఆయన హెచ్చరించారు.పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకున్న పలు చర్యలతో, ముఖ్యంగా సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ క్రమంలోనే పాకిస్థాన్ మంత్రులు తరచూ భారత్ ఎప్పుడైనా దాడి చేయవచ్చంటూ నిఘా వర్గాల సమాచారం ఉందని చెబుతున్నారు.

సమా టీవీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ, "మా భద్రతకు ముప్పు వాటిల్లితే, మేం పూర్తిస్థాయి దూకుడుతో పోరాడతాం. మాకేదన్నా జరిగితే, అక్కడ (భారత్ లో) మరెవరూ ఉండరు" అని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని భారత్ ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. నిషేధిత టీటీపీ (తహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్), బీఎల్ఏ (బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ) సంస్థలు భారత్‌కు కిరాయి సైనికులుగా, ప్రతినిధులుగా పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. "మా సరిహద్దులకు ఇరువైపులా శత్రువులు ఉన్నారు" అని ఆయన పేర్కొన్నారు.భారత ప్రధాని నరేంద్ర మోదీని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పోల్చిన ఆసిఫ్, ఇద్దరూ అహంకార పూరిత వ్యక్తులని ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రమాదకరమైన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఒకవేళ యుద్ధం ప్రారంభమైతే అది నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వరకే పరిమితం కాకపోవచ్చని, దాన్ని అదుపు చేయడం సాధ్యం కాదని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. "నెతన్యాహు అడుగుజాడల్లో నడుస్తూ మోదీ ఏదైనా తొందరపాటు చర్య తీసుకుంటే, పాకిస్థాన్ ప్రతిస్పందన చరిత్ర గుర్తుంచుకునేలా ఉంటుంది," అని ఆయన హెచ్చరించారు.1961 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇది ఒక యుద్ధ చర్య అని అభివర్ణించారు. "మా నీటిని ఆపడానికి భారత్ ఏదైనా నిర్మాణం చేపడితే, దాన్ని ధ్వంసం చేస్తాం. నీరు మాకు లక్ష్మణ రేఖ లాంటిది. భవిష్యత్ యుద్ధాలు నీటి కోసమే జరుగుతాయి," అని ఆసిఫ్ తెలిపారు. మే నెలాఖరు నాటికి నదులు, కాలువల్లో నీటి ప్రవాహం పెరిగిందని ఆయన అన్నారు.సోమవారం కూడా ఆసిఫ్ మాట్లాడుతూ, కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి భారత్ ఎప్పుడైనా సైనిక దాడికి పాల్పడవచ్చని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ ఈ ప్రాంతాన్ని అణుయుద్ధం అంచుకు నెట్టేస్తున్నారని, ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్‌లలో ఉగ్రవాదంలో న్యూఢిల్లీ ప్రమేయం ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఇస్లామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, "నియంత్రణ రేఖ వెంబడి భారత్ ఎప్పుడైనా దాడి చేయవచ్చని నివేదికలున్నాయి. న్యూఢిల్లీకి తగిన రీతిలో సమాధానం ఇస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.గతవారం, పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తా తరార్ కూడా భారత్ నుంచి దాడి జరగవచ్చనే భయంతో రాబోయే 24-36 గంటలు కీలకమని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే, ఆ సమయం గడిచిపోయినా భారత్ నుంచి ఎలాంటి చర్యలు లేవు. మరోవైపు, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ సయ్యద్ అసిమ్ మునీర్ సోమవారం మాట్లాడుతూ, తమ ప్రజల జాతీయ ప్రతిష్ట, శ్రేయస్సును కాపాడేందుకు పూర్తి బలంతో ప్రతిస్పందిస్తామని పునరుద్ఘాటించారు.

## గాలి జనార్ధన్ రెడ్డి సహా దోషులందరికీ 7 ఏళ్ల జైలు శిక్ష

- మొదటి పేజీ తరువాయి

సహాయకుడు కె.మెఫజ్ అలీఖాన్, అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌తో పాటు ఓఎంసీ కంపెనీని కూడా న్యాయస్థానం దోషులుగా నిర్ధారించింది. వీరందరికీ ఏడేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధిస్తూ సీబీఐ కోర్టు తీర్పు చెప్పింది. మరోవైపు, ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి న్యాయస్థానం ఊరట కల్పించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి కృపానందంలను నిర్దోషులుగా ప్రకటిస్తూ సీబీఐ కోర్టు తీర్పును వెలువరించింది. వీరిపై మోపిన అభియోగాలు నిరూపితం కాలేదని న్యాయస్థానం పేర్కొన్నట్లు సమాచారం.ఈ కేసులో ఏ1గా బీవీ శ్రీనివాసరెడ్డి, ఏ2గా గాలి జనార్ధన్‌రెడ్డి, ఏ3గా వీడీ రాజగోపాల్, ఏ4గా ఓఎంసీ కంపెనీ, ఏ7గా కె.మెఫజ్ అలీఖాన్ దోషులుగా తేలారు. కాగా, ఏ8గా ఉన్న కృపానందం, ఏ9గా ఉన్న సబితా ఇంద్రారెడ్డి నిర్దోషులుగా బయటపడ్డారు. ఈ కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే ఏ5 నిందితుడిగా ఉన్న అటవీశాఖ అధికారి లింగారెడ్డి మరణించారు. ఇక, మరో నిందితురాలిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని (ఏ6) తెలంగాణ హైకోర్టు 2022లోనే ఈ కేసు నుంచి పూర్తిగా డిశ్చార్జ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# ఉగ్రదాడి గురించి మోదీకి 3 రోజుల ముందే తెలుసు..

**పెన్ పవర్ డెస్క్:** భారత ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి గురించి మోదీకి మూడు రోజుల ముందే సమాచారం అందిందని ఆయన తెలిపారు. ఈ నిఘా నివేదిక కారణంగానే ప్రధాని తన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. జార?ండ్‌లోని రాంచీలో జరిగిన 'సంవిధాన్ బచావో ర్యాలీ'లో ఖర్గే ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. "నిఘా వైఫల్యం జరిగిందని ప్రభుత్వం అంగీకరించింది, దాన్ని పరిష్కరిస్తామని కూడా చెప్పింది. ఒకవేళ వారికి ముందే ఈ విషయం తెలిస్తే, ఎందుకు తగిన చర్యలు తీసుకోలేదు? పహల్గామ్ దాడికి మూడు రోజుల ముందే ప్రధాని మోదీకి ఇంటెలిజెన్స్ నివేదిక అందిందని, అందుకే ఆయన తన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని నేను వార్తాపత్రికల్లో చదివాను. ఇంటెలిజెన్స్ నివేదిక అందినప్పుడు భద్రతాబలగాలను ఎందుకు అలర్ట్ చేయలేదు?" అని ఖర్గే ప్రశ్నించారు. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ఖర్గే చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మల్లికార్జున ఖర్గే చేసిన ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ తీవ్రంగా స్పందిం చారు. ఖర్గే వ్యాఖ్యలను ఆధునిక మీర్ జాఫర్ చేసిన ద్రోహపూరిత ప్రకటనలుగా ఆయన అభివర్ణించారు. ప్రధానమంత్రిపై ఆయన చేసినవి విషపూరితమైన, నిరాధారమైన ఆరోపణలని, ఇవి తీవ్రంగా ఖండించదగినవని, క్షమించరానివని కేశవన్ అన్నారు. ఖర్గే తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు

- మొదటి పేజీ తరువాయి

తమ స్వప్రయోజనాలకు వాడుకుంటూ భక్తుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం కనుగొనేందుకు చర్యలు తీసుకుంటామని ఈవో స్పష్టం చేశారు. ప్రస్తుతం టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలను పునఃసమీక్షించి, భక్తులకు మరింత పటిష్టమైన, మెరుగైన వసతులు కల్పించనున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా తిరుపతి నుంచి శ్రీవారి మెట్టు మార్గానికి నడిచే ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచే విషయాన్ని, అలాగే టోకెన్ల జారీ కౌంటర్లను అధికం చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. భక్తుల నుంచి సూచనలు, అభిప్రాయాలు (ఫీడ్‌బ్యాక్) స్వీకరించి, వాటి ఆధారంగా పటిష్టమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని శ్యామలరావు హామీ ఇచ్చారు. తద్వారా శ్రీవారి దర్శనానికి కాలినడకన వచ్చే ప్రతి భక్తుడికి సులభతరమైన, సౌకర్యవంతమైన అనుభూతిని అందించడమే లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఇంజనీర్లు వేంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీ ఈవో లోకనాథం తదితర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారీ యూనిట్.. మే 8న మంత్రి లోకేశ్ భూమిపూజ

- మొదటి పేజీ తరువాయి

కృష్ణా జిల్లా మల్లవల్లిలో హిందూజా గ్రూప్ అశోక్ లేలాండ్ వాహన తయారీ యూనిట్ ఉత్పత్తిని ప్రారంభించగా, ప్రకాశం జిల్లా కనిగిరిలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు కూడా భూమిపూజ జరిగింది. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్థిక అభివృద్ధి మండలి (ఈడీబీ)ని బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. అమెరికా, దావోస్ వంటి

అంతర్జాతీయ వేదికలపై పారిశ్రామికవేత్తలతో సమావేశమై, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, వారిని ఆహ్వానించడంలో మంత్రి లోకేశ్ క్రియాశీలక పాత్ర పోషించారు.

## గంటా శ్రీనివాస్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు తప్పిన ప్రమాదం

- మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్క్ శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, కృష్ణాపురంలో రూ. 12.40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఎంఎస్ఎంఈ పార్క్ పనులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈరోజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత, నాయకులతో ఫోటోలు దిగేందుకు కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో ఒక్కసారిగా వేదికపైకి దూసుకువచ్చారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో జనం రావడంతో భారం తట్టుకోలేక సభా వేదిక ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే, అదృష్టవశాత్తూ మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడటంతో అధికారులు, పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు.మరోవైపు, ఈ ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుపై గంటా శ్రీనివాసరావు ఎక్స్ వేదికగా స్పందించారు. "పద్మనాభం మండలం కృష్ణాపురంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఈరోజు ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించాం. ఇది ఉత్తరాంధ్రలోనే మొదటి ఎంఎస్ఎంఈ పార్క్" అని ఆయన పేర్కొన్నారు. మొదటి దశలో 21.72 ఎకరాల్లో 163 ప్లాట్లను విభజించామని, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 12.40 కోట్లు ఖర్చు చేస్తున్నామని గంటా వివరించారు. ఈ పార్క్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వేలాది మంది గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపన కార్యక్రమం ముగిసిన అనంతరం, పాండ్రంగి వంతెన నిర్మాణ పనులను కూడా పరిశీలించినట్లు గంటా శ్రీనివాసరావు తన ఎక్స్ పోస్టులో తెలిపారు.

## మాక్ డ్రిల్... మూడు కేటగిరీలుగా విభజన... రెండో కేటగిరీలో హైదరాబాద్, వైజాగ్

- మొదటి పేజీ తరువాయి

అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.ఈ నేపథ్యంలో, మాక్ డ్రిల్ సన్నద్ధతపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఈరోజు కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సివిల్ డిఫెన్స్, ఎన్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్స్ (డీజీలు), జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్డీఎంఏ) అధికారులు హాజరయ్యారు. అనంతరం, గోవింద్ మోహన్ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రేపు జరగబోయే మాక్ డ్రిల్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై వారికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 244 జిల్లాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ముఖ్యంగా డిఫెన్స్, అణు విద్యుత్ కేంద్రాలు ఉన్న ప్రాంతాలను ప్రాతిపదికగా చేసుకుని ఈ జిల్లాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. అణు విద్యుత్ కేంద్రాలున్న ఢిల్లీ, ముంబై, సూరత్, వడోదర, కక్రాపూర్, తారాపూర్, తాల్చేర్, కోట, రావత్ భటా, చెన్నై, కల్పక్కం, నరోరా వంటి ప్రాంతాలు కేటగిరీ-1 కిందకు వస్తాయి. ఇక కేటగిరీ-2 జాబితాలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. మూడో కేటగిరీలో 45 జిల్లాలున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లోని విమానాశ్రయాలు, ఇతర జనసమర్థ ప్రాంతాల్లో ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. ఈ కసరత్తులో భాగంగా ప్రజలకు శిక్షణ, అవగాహన కల్పించడంపై హోంశాఖ సమీక్షలో ప్రధానంగా

చర్చించారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు (బ్లాక్ అవుట్) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స కోసం ఇళ్లలో ఉంచుకోవాల్సిన అత్యవసర వస్తువులు, మందుల గురించి ప్రజలకు వివరించాలని సమావేశంలో సూచించారు.ఇదిలా ఉండగా, భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ ఈరోజు ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రస్తుత భద్రతా పరిస్థితులు, పాకిస్తాన్ వైఖరి, తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

## దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతి

- మొదటి పేజీ తరువాయి

మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయని, ప్రపంచానికి ధీటైన రాజధాని నిర్మాణానికి ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రూ.49 వేల కోట్ల విలువైన 74 పనులకు శంకుస్థాపన చేయడం, కేంద్ర ప్రభుత్వం అమరావతి పునఃనిర్మాణానికి సంపూర్ణ మద్దతు ప్రకటించడం రాష్ట్ర అభివృద్ధికి శుభపరిణామమని శ్రీదేవి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసికట్టుగా ఈ పనులు పూర్తి చేయాలని ప్రధాని సూచించారని గుర్తుచేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి కూడా అమరావతి నిర్మాణంలో కీలకమని ప్రశంసించారు.

గత వైసీపీ ప్రభుత్వంపై శ్రీదేవి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "జగన్మోహన్ రెడ్డి తన పాలనలో అమరావతిని ధ్వంసం చేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. 'మాట తప్పను, మడమ తిప్పను' అని చెప్పి అమరావతి విషయంలో మాట మార్చారు" అని ఆరోపించారు. మద్యం కుంభకోణాలతో రాష్ట్రాన్ని దోచుకున్నారని, రుషికొండపై అనవసర వ్యయం చేశారని ధ్వజమెత్తారు. దళిత రాజధానిగా రూపుదిద్దుకోవాల్సిన అమరావతిని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు."అమరావతి 2.0 కింద 17 కీలక ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యాయి. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తిచేయడంతో పాటు, నూతన ఐకానిక్ భవనాలను నిర్మిస్తాం" అని శ్రీదేవి వివరించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు, హ్యాపీనెస్ట్ వంటి ప్రాజెక్టులు రూపుదిద్దుకోనున్నాయని తెలిపారు. అమరావతిలో అందుబాటులో ఉన్న రెండు లక్షల కోట్ల విలువైన మిగులు భూమి ద్వారా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చని ఆమె పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక

## రోడ్డు యాక్సిడెంట్ బాధితులకు ఫ్రీ ట్రీట్మెంట్..

**పెన్ పవర్ డెస్క్:** ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తూనే ఉన్నప్పటికీ దేశంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సర్వ సాధారణంగా మారిపోయాయి. అయితే అలాంటి సమయంలో వాహనదారుల విలువైన ప్రాణాలను కాపాడటానికి కేంద్రం అనేక కొత్త నిబంధనలను ప్రవేశపెడుతూనే ఉంది. తాజాగా ప్రమాద బాధితులకు ఎలాంటి డబ్బు చెల్లించకుండానే సకాలంలో వైద్యం అందేలా చూసేందుకు సరికొత్త ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. కేంద్ర రోడ్డు రవాణా హైవేల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం ఇకపై రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులకు రూ.లక్షన్నర వరకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ పొందేందుకు వీలుకల్పించింది. అయితే ఇది ఎంపిక చేయబడిన ఆసుపత్రుల్లో యాక్సిడెంట్ తర్వాత 7 రోజుల లోపు వైద్య సేవలను పొందటానికి వెసులుబాటు కల్పించనుంది. రోడ్డు ప్రమాద బాధితుల క్యాష్ లెస్ ట్రీట్మెంట్ స్కీమ్ మే 5, 2025 నుంచి అమలులోకి వస్తుందని గెజిట్ నోటిఫికేషన్ స్పష్టం చేసింది. మోటారు వాహనాన్ని నడుపుతున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురైతే స్కీమ్ కింద నిబంధనల ప్రకారం వైద్య సేవలు ఉచితంగా అందించబడతాయని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ జనవరిలో వెల్లడించారు. దీనిని జాతీయ ఆరోగ్య సంస్థ పోలీసులు, ఆసుపత్రులు, రాష్ట్రాల హెల్త్ ఏజెన్సీల సహకారంతో పర్యవేక్షించనుంది. ఏ రోడ్డుపై ప్రమాదం జరిగినా ఈ స్కీమ్ వర్తించనుంది. అలాగే స్కీమ్ కింద లేని ఆసుపత్రులకు బాధితులను తరలించినప్పుడు అత్యవసరంగా వారిని సాధారణ స్థితికి తీసుకురావటానికి మాత్రమే అనుమతించబడుతుంది. ఏటా దాదాపు రోడ్డు ప్రమాదాల్లో దాదాపు లక్షన్నర మంది ప్రాణాలు కోల్పోతున్నారని మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొంటూ వారి ప్రాణాలను రక్షించటానికి చేస్తున్న ప్రయత్నంగా దీనిని పేర్కొన్నారు. అలాగే హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు గడ్కరీ వెల్లడించారు.

## లండన్ లో తీవ్రంగా గాయపడ్డ సుజనా చౌదరి... హైదరాబాద్ తరలింపు

**పెన్ పవర్ డెస్క్:** బీజేపీ సీనియర్ నాయకుడు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు సుజనా చౌదరి లండన్ పర్యటనలో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఆయన కుడిచేయికి తీవ్ర గాయమైనట్లు సమాచారం. లండన్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయన్ను హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సుజనా చౌదరి ఇటీవల లండన్‌లో పర్యటిస్తున్న సమయంలో బాత్రూమ్‌లో ప్రమాదవశాత్తూ జారిపడినట్లు తెలుస్తోంది. లండన్‌లో వైద్యులు ఆయనకు తక్షణ వైద్య సహాయం అందించారు. అనంతరం, మెరుగైన చికిత్స మరియు శస్త్రచికిత్స అవసరమని భావించడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఈ తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో లండన్ నుంచి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సుజనా చౌదరిని నేరుగా బేగంపేటలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్య వర్గాలు ప్రాథమికంగా వెల్లడించాయి. సుజనా చౌదరి ప్రమాదానికి గురైన విషయం తెలియడంతో ఆయన అభిమానులు, బీజేపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. అయితే, సుజనా చౌదరి ఆరోగ్య పరిస్థితి, గాయం తీవ్రత తదితర అంశాలపై కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం అధికారికంగా హెల్త్ బులెటిన్ విడుదల చేస్తే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## పహల్గామ్‌పై అంతకుమించి ఏమీ ఉండదు..!

**పెన్ పవర్ డెస్క్:** భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారం నిర్వహించిన క్లోజ్డ్ డోర్ సమావేశం ఎలాంటి నిర్దిష్ట ఫలితాన్ని ఇవ్వబోదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ సమీకరణాల దృష్ట్యా, ఏ పక్షానికీ అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ బలమైన తీర్మానాలు వెలువడే అవకాశం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. భద్రతా మండలి సభ్యదేశాల మధ్య సంప్రదింపుల అనంతరం వెలువడే ప్రకటన చాలా సాధారణంగా ఉంటుందని శశి థరూర్ పేర్కొన్నారు. "ఒకవేళ పాకిస్థాన్‌ను విమర్శిస్తూ ఏదైనా తీర్మానాన్ని ప్రవేశపెడితే, చైనా తన వీటో అధికారంతో దానిని నిరోధిస్తుంది. అదే సమయంలో, భారత్‌ను తప్పుబడుతూ తీర్మానం వస్తే, అనేక ఇతర దేశాలు దానిని అడ్డుకుంటాయి" అని అన్నారు.

అందువల్ల, "కేవలం శాంతియుత వాతావరణానికి పిలుపునివ్వడం, ఉగ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేయడం వంటి పడికట్టు పదాలతో కూడిన సాధారణ ప్రకటన వెలువడుతుందే తప్ప, అంతకు మించి ప్రత్యేకమైన పరిణామాలు ఏవీ ఉండకపోవచ్చు" అని థరూర్ అంచనా వేశారు. ఈ పరిస్థితి విచారకరమైన వాస్తవమని ఆయన వ్యాఖ్యానించారు.ఏప్రిల్ 22న కశ్మీర్‌లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి అనంతరం, భారతదేశం పాకిస్థాన్‌పై కఠిన వైఖరి అవలంబించడం ప్రారంభించింది. ఇందులో భాగంగా సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం వంటి చర్యలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల క్రమంలోనే ఐరాస భద్రతా మండలి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో భారత్‌కు వ్యతిరేకంగా ఒక తీర్మానాన్ని ఆమోదింపజేసుకోవాలని పాకిస్థాన్ తొలుత భావించినప్పటికీ, ఆ దేశ ప్రయత్నాలు సఫలం కాలేదు. పైగా, ఇస్లామాబాద్ ఇటీవల చేసిన బహిరంగ అణు బెదిరింపులు, వరుస క్షిపణి పరీక్షల నిర్వహణపై పలు సభ్య దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ అంశాలపై పాకిస్థాన్‌ను నిలదీసినట్టు తెలుస్తోంది.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో వైభవంగా శ్రీ సీతా జయంతి



**ఒంటిమిట్ట పెన్ పవర్ మే 6 :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సీతా జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఆలయంలోని రంగ మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. ప్రత్యేకంగా సీతమ్మవారికి "వాసంతిక పూజ" మల్లె పూలతో సహస్రనామ అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## "ప్రజాదర్బార్"లో సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు

### - మంత్రి పయ్యావుల కేశవ్



**అనంతపురం, పెన్ పవర్ మే 06 :** అనంతపురం నగరంలోని రాంనగర్ లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ రకాల ప్రజా సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలను మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

### - వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ మే 06 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరితగతిన, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో ఉరవకొండ నియోజక వర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్దనున్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను పరిశీలించడానికి వస్తున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై జిల్లాలోని ఆయా శాఖల జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రాంతాలలో ఎక్కడా చెట్లను తొలగించరాదని, న్యాచురల్‌గా ఉండాలని, అనవసరమైన ఖర్చులు చేయరాదని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అనవసర బ్యారికెడ్ లను ఏర్పాటు చేయరాదని, అలాగే సభా ప్రాంగణంలో ఆ గ్రామానికి చెందినవారే ఉండే విధంగా చూడాలని, 14 నియోజకవర్గాల పరిధిలో ఒక్కొక్క నియోజకవర్గ నుండి 10 మంది ఆయకట్టు లబ్ధిదారులు, మొత్తం దాదాపు 3000 మంది మాత్రమే వచ్చేవిధంగా చూడాలని పిడి డిఆర్డిఏ అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, కాన్వాయ్, సభా ప్రాంగణం, తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని, కూబింగ్ ఆపరేషన్ త్వరితగతిన పూర్తిచేయాలని, అనుమానితులను గుర్తించాలని, అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేయాలని, అలాగే అవసరం ఉన్నచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకొని తరువాయి 4లో..

## నేతన్నలకు 365 రోజులు పని కల్పించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం

### - రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత & జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత



**కర్నూలు, పెన్ పవర్ మే 06 :** మన ప్రభుత్వంలో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత & జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మే ఒకటవ తేదీన నెల్లూరు జిల్లాలో 175 నియోజకవర్గాలకు ఒకటి చొప్పున 175 msme పార్కులకు వర్చువల్ గా భూమి పూజ నిర్వహించిన సందర్భంగా ఎమ్మిగనూరు నియోజక వర్గానికి సంబంధించి మంగళవారం ఎమ్మిగనూరు మండలం బనవాసి లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత & జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, చేనేత & జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వం చేనేతలకు ఎటువంటి మేలు చేకూర్చలేదన్నారు... మంగళగిరిలో చేనేతలు పడుతున్న ఇబ్బందులు దగ్గరుండి చూసినందువల్ల తాను చేనేత జౌళి శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తనని పిలిచి చేనేతలను బాగా చూసుకోవాలని చెప్పారన్నారు..

మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం పవర్ లూమ్ కి 500 యూనిట్లు, హ్యాండ్లూమ్ కి 200 యూనిట్లు ఉచిత కరెంట్ అమలు పరుస్తున్నామన్నారు. అంతే కాకుండా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి నెల ఒక్కొక్క చోట ఎగ్జిబిషన్ లను ఏర్పాటు చేసి వారికి సౌకర్యంగా అన్ని సదుపాయాలు కూడా ఏర్పాటు చేసి వారికి కావాల్సిన ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు....ముఖ్యమంత్రి చేసిన కృషి వల్ల రాష్ట్రానికి చాలా క్లస్టర్లు మంజూరు చేసి రూ.348 కోట్లు కేటాయించారన్నారు..చేనేతలకు లేటెస్ట్ డిజైన్ల శిక్షణ ఇచ్చేందుకు గాను స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లను ఏర్పాటు చేయబోతున్నామని, ఎమ్మిగనూరు లో కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్రేమ్ లూమ్స్ కావాలనుకునే వారందరికీ వారికి అర్హత ప్రకారం 90 శాతం సబ్సిడీతో ఫ్రేమ్ లూమ్స్ కూడా చేనేతలకు ఇస్తామన్నారు... ఇచ్చిన హామీ మేరకు త్రిఫ్ట్ ఫండ్ కూడా 5 కోట్ల రూపాయలు అందచేస్తామన్నారు..అంతేకాకుండా విశాఖలో 172 కోట్ల రూపాయలతో నిర్మించిన యూనిటీ మాల్ ను కూడా ప్రధానమంత్రి గారు ప్రారంభించారన్నారు.. అందులో మన చేనేతలు తయారుచేసిన వస్త్రాలు ఎగ్జిబిషన్స్ లో నిరంతరంగా పెట్టుకోవచ్చునన్నారు. ప్రతి చేనేతకు 365 రోజులు పని కల్పించాలనదే రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో చేనేతలకు హెల్త్ పాలసీ కూడా ఇవ్వబోతున్నామన్నారు. అదే విధంగా ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు పెన్షన్ కూడా పెంచామన్నారు... మెగా టెక్స్టైల్ పార్క్ ను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు... 25 ఎకరాల్లో హ్యాండ్లూమ్ పార్క్, మిగతా భూమిలో ఇండస్ట్రియల్ టెక్స్టైల్ పార్క్ తీసుకొని వచ్చి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.... ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచామని, న్నా క్యాంటీన్ లు ప్రారంభించామని, దీపం 2 పథకం కింద ఉచిత సిలిండర్లు అందించామని, ఉచిత ఇసుక అందించామని మంత్రి తెలిపారు. పల్లె పండుగ ద్వారా రోడ్ల మీద గుంతలను పూడ్చామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలు కు హై కోర్టు బెంచ్ తీసుకొని వస్తున్నామని, అదే విధంగా డ్రోన్ హబ్ ను కూడా తీసుకొని వస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చేసిన కృషి వల్ల తరువాయి 4లో..

## కడప జిల్లా విద్యారత్నాలు పేరిట అభినందన సభ




**వైయస్సార్ జిల్లా, పెన్ పవర్ మే 6 :** చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రణాళిక బద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక శిల్పారామంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ,జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు హాజరయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన మొదటి 10 మంది విద్యార్థులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు సన్మానించి మెమెంటోలు అందజేశారు.అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి ఆత్మీయ విందు భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జిల్లా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ప్రపంచం తో పోటీపడే సత్తాని మనం మన విద్యార్థులకి అందించాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన విద్యతో సాధారణ విద్యార్థిని కూడా ఉపాధ్యాయులు విజయవంత మైన స్థాయిలో నిలుపగలరని అన్నారు.మార్కులనే కొలమానంగా కాకుండా తరువాయి 4లో..

## శ్రీవారి మెట్టు మార్గంలో సౌకర్యాలు కల్పిస్తాం

### టిటిడి ఈవో జె.శ్యామల రావు



**తిరుమల పెన్ పవర్ మే 6 :** తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారి మెట్టు మార్గంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి ఈవో జె.శ్యామలరావు తెలిపారు. కాలినడకన వెళ్లే మార్గంలో టోకెన్లు పొందేందుకు భక్తులు అసౌకర్యానికి గురౌతున్నట్లు తెలియడంతో టిటిడి అదనపు శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మంలతో కలిసి ఆయన మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీవారి మెట్టు మార్గంలో టోకెన్లు పొందడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోవాలాల నుండి సరైన సహకారం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. టిటిడి కల్పిస్తున్న



సౌకర్యాలను ఆటోవాలాలు స్వప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు, భక్తుల నుండి విచ్చలవిడిగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు శాశ్వత పరిష్కార మార్గం దిశగా చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. భక్తులకు టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించుకుని, మరింత మెరుగైన పటిష్టమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తిరుపతి నుండి శ్రీవారి మెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచడాన్ని మరియు టోకన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాలను పరిశీలిస్తామన్నారు. భక్తుల నుండి ఫీడ్ బ్యాక్ సేకరించి పటిష్ట సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి సీఈ శ్రీ సత్యనారాయణ, ఎస్ ఈలు శ్రీ వేంకటేశ్వర్లు, మనోహరం, టిటిడి డిప్యూటీ ఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సజావుగా ఏపిపిఎస్సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

### జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ







**అనంతపురం, పెన్ పవర్ మే 06 :** ఏపిపిఎస్సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీ బాలాజీ పీజీ కాలేజీ పరీక్ష కేంద్రాలలో జరుగుతున్న ఏపిపిఎస్సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఏపిపిఎస్సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈనెల 03 నుండి 09 వరకు ప్రతిరోజు ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతోందని, పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్ష కేంద్రానికి 234 మంది అభ్యర్థులను కేటాయించగా, 149 మంది హాజరుకాగా, 85 మంది గైర్హాజరయ్యారు. శ్రీ బాలాజీ పీజీ కాలేజీ పరీక్ష కేంద్రానికి 360 మంది అభ్యర్థులను కేటాయించగా, 232 మంది హాజరుకాగా, 128 మంది గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, కెఆర్ఆర్సి ఎస్డిసి తిప్పేనాయక్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం




**తిరుమల పెన్ పవర్ మే 6 :** మే 11 నుండి 13వ తేదీ వరకు వసంతోత్సవాలు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 11 నుండి 13వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం మే 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 12వ తేదీ ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ



వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఈ ఉత్సవాల కారణంగా మే 11 నుండి 13వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏఈవో దేవ రాజులు, సూపరింటెండెంట్ జీ.రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్లు చలపతి, సుబ్బ రాయుడు, ప్రసాద్, ఏవీఎస్వో జీ.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్లు పంపిణీ



**చిత్తూరు, పెన్ పవర్ మే 06 :** చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల 18 మంది విభిన్న ప్రతిభావంతులకు ఎంపి ల్యాడ్స్ నిధుల నుండి ఒక్కొక్కటి రూ.6.30 లక్షల విలువ గల బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్ళను మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్, కె.మురళి మోహన్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏ.వై.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## మెగా టెక్స్టైల్స్ పార్క్ నిర్మాణానికి భూమి పూజ





**ఎమ్మిగనూరు పెన్ పవర్ మే 6 :** ఎమ్మిగనూరు మండలం బనవాసిలో మెగా టెక్స్టైల్ పార్కు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, బీసీ సంక్షేమ, చేనేత& జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, చేనేత& జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

## అసంఘటిత కార్మికుల రక్ష ఈ-శ్రామ్ కార్డులు అని తెలిపిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రంగనాథ్





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 6 :** న్యాయవారోత్సవాలు మరియు అంతర్జాతీయ కార్మిక దినోత్సవాల్లో భాగంగా మరియు గౌరవ జిల్లా జడ్జ్ ఆదేశాల మేరకు ఈరోజు శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన వద్ద కార్మికులకు ఉచిత ఈ-శ్రామ్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి అసిస్టెంట్ లేబర్ అధికారి రంగనాథ్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వరరావు, న్యాయవాదులు అరుణ్, శ్రీరామ్ మరియు పిఎల్వీలు పాల్గొన్నారు. అధికారి రంగనాద్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ పథకం ప్రతి అసంఘటిత కార్మికులకు రక్షణగా నిలుస్తుందని తెలిపారు. వలస కార్మికులకు, గృహ కార్మికులతో సహా అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ ప్రయోజనం చేకూర్చే ఈ ఈ-శ్రామ్ కార్డు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే దీనివల్ల ఉపయోగాలు ఏమంటే అసంఘటిత రంగాల కార్మికులకు 60 ఏళ్ల తర్వాత పెన్షన్ , అలాగే ఆక్సిడెంట్ బీమా, వైకల్యం ఉంటే ఆర్థిక సహాయం వంటి ప్రయోజనాలు పొందవచ్చు అని తెలిపారు. కావున ప్రతి ఒక్క కార్మికుడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## సర్వభూపాల, సింహ వాహనాలలో ఊరేగిన చెన్నకేశవుడు

**ఆలయ ఈవో వెంకటేశులు, అడ హక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్**





**ధర్మవరం, పెన్ పవర్ మే 6 :** పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయం వారి బ్రహ్మోత్సవ వేడుకలు మూడవ రోజు దాతలు, భక్తాదులు, ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం సర్వ భూపాల వాహనము, సాయంత్రం సింహ వాహనం నకు అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, చక్రధర్‌లు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలయం ప్రత్యేక అర్చనలు, పూజలు చక్కటి అలంకరణ గావించారు. వాహనానికి ఉభయ దాతలుగా రంగన్న అచ్చప్ప అండ్ సన్స్, జూజారు సత్య ప్రభా, సురేష్, రాధా, నీలూరి శ్రీనివాసులు, శ్రీధర్, మనీషా, పుట్లూరు కుల్లాయప్ప అండ్ సన్స్, జగ్గా నాగరాజు, హరిణి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. సాయంత్రం సింహ వాహనం కు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉభయ దాతలుగాఅడ్డగిరి గోపాల్, అడ్డగిరి విశ్వనాథ్, కీర్తిశేషులు చుక్కలూరు సోలిగాళ్ళ నాగమ్మ, ఆంజనేయులు అండ్ సన్స్ , కమ్మ శేషన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం వీరి పేరిటన ప్రత్యేక పూజలు చేసి, వారిని చైర్మన్ ఘనంగా శాలువాతో సత్కరించారు. తదుపరి పట్టణ పురవీధుల గుండా ప్రత్యేకమైన వాహనంలో స్వామివారు ప్రజల దర్శనార్థం ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలతో పాటు పట్టణ పుర ప్రముఖులు, ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రికి స్వాగతం పలికిన అధికారులు









**చిత్తూరు జిల్లా పెన్ పవర్ మే 6 :** చిత్తూరు జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లాకు విచ్చేసిన చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. మంగళవారం జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు మంగళవారం ఉదయం చేరుకున్న మంత్రికి డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఆర్ఎంఆర్టిసి జగదీష్,చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు,జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బాలాజీ, సెట్విన్ సిఈఓ మోహన్ కుమార్‌లు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## విలేజ్ క్లినిక్‌లను తనిఖీ చేసిన జోనల్ ఇన్చార్జి అధికారి కృష్ణబాబు





**తిరుపతి పెన్ పవర్ మే 6 :** రాష్ట్రం ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇన్చార్జ్ అధికారి ఎం.టి కృష్ణబాబు కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తో కలిసి తనపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇన్చార్జ్ అధికారి మాట్లాడుతూ.. ఆస్పత్రికి రోజు వారి వచ్చు పేషెంట్ల వివరాలు వారికి అందిస్తున్నటువంటి సేవలను గురించి ఆరాధిస్తూ వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పిల్లలు, గర్భవతులకు సరైన సమయంలో వాక్సినేషన్ ఇవ్వాలని తెలిపారు. నాన్ కమ్యూనికేషన్ డిసీజెస్ ఎన్సిడి సర్వే ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. సర్వే ద్వారా బీపీ షుగర్ వ్యాధులకు సంబంధించిన డేటా పక్రియ సక్రమంగా నిర్వహించాలని ఏఎన్ఎం లకు సూచించారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా బేబీ షుగర్ కు సంబంధించిన మందులు అందుబాటులో ఉండాలని వ్యాధి నిర్ధారణ అయినవారికి సకాలంలో చికిత్స అందించేలా చూడాలని తెలిపారు. బీపీ, షుగర్‌కు సంబంధించిన మందులు ఆసుపత్రి నందు అందుబాటులో ఉంచుకోవాలని మెడికల్ సూపర్డెంట్‌ను ఆదేశించారు. 104 అంబులెన్స్ వాహనం ద్వారా ఎంత మందికి చికిత్స అందించడం జరిగిందని, వారికి అవసరమైన మందులు అందించేలా ఏఎన్ఎంలు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్ష్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డీఐఓ శాంత కుమారి, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి మెడికల్ సూపరిండెంట్ ఉదయశ్రీ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికుల న్యాయ అవగాహన సదస్సు




**కడప పెన్ పవర్ మే 6 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ లోపుసేవాధికార సంస్థ, కడప వారు అసంఘటిత కార్మికుల అవగాహన కార్యక్రమాల సందర్భంగా న్యాయ సేవాసదన్, కడప నందు జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, ఈ-శ్రమ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి, అసంఘటిత కార్మికుల/వ్యవసాయ కార్మికుల యొక్క సమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయము, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. జిల్లావ్యాప్తంగా 1-5-2025 నుండి 5-5-2025 (5 రోజులలో) జిల్లా వ్యాప్తంగా 46 అవగాహన కార్యక్రమాలు జరిగాయి ఈ సందర్భంగా 1648 అసంఘటిత కార్మికులు లబ్ధి పొందారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఐదు రోజులలో 203 ఈ శ్రమ కార్డులను రిజిస్ట్రేషన్ చేయడం జరిగినది. తద్వారా అసంఘటిత కార్మికులకు లబ్ధి చేకూరడం జరిగింది. అనంతరం 22 మంది అసంఘటిత కార్మికులకు ఈ శ్రమ కార్డులను చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప గౌరవ డాక్టర్ సి.యామిని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్ కడప, రీజినల్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ కడప, ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా కడప, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కడప, కడప మేనేజర్ మున్సిపల్ కార్పొరేషన్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కడప, మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కడప, మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారులు చింతకొమ్మదిన్నె వల్లూరు పెండ్లిమర్రి చెన్నూరు, డిస్టిక్ ఆఫీసర్ కడప మరియు వివిధ రంగాల అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

## బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి నివాళులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 6 :** శ్రీకాళహస్తిలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 3వ వర్ధంతి నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గోపాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాళహస్తిలో 5సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ఎనలేని సేవలందించారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

**(3వ పేజీ తరువాయి)** ఏర్పాట్లను పూర్తి చేయాలని పోలీస్ శాఖ వారిని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన కాన్వాయ్ గుడ్ కండిషన్ వాహనాలను ఏర్పాటుచేసి వాటిని పరిశీలించి సర్టిఫై చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. గుంతకల్, కొనకొండ్ల మీదుగా ఉరవకొండ వచ్చే రోడ్డును ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దారి మళ్లించడం (డైవర్ట్) చేయడం, దానిని గుంతకల్ నుండి వజ్రకరూరు మీదుగా ఉరవకొండకు చేరుకునే విధంగా చూడాలని తెలిపారు.

హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లకు సంబంధించి ఒక టీం వచ్చిందని, వారితో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలని, అలాగే ఒక తహసీల్దార్ ను లైజాన్ ఆఫీసర్‌గా నియమించాలని అనంతపురం వారికి ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద బ్యారికేడ్‌ను, టెంట్, టెంపరరీ టాయిలెట్స్ ను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని వాటిని పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద వాహనాలు పార్కు చేయుటకు ఆర్అండ్బి ఎస్ఈ మరియు పంచాయతీరాజ్ ఎస్ఈ ఏర్పాట్లు చేసుకోవాలని, హెలిప్యాడ్ వద్ద నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఒక ఏఈ, లైన్మెన్ ను ఆర్అండ్బి ఎస్ఈ వారితో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేయాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వారికి ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రాగునీరు, బయో స్టాయిలెట్స్ ను హెలిప్యాడ్ మరియు సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చూడాలని, మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని, డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వారు ప్రోటోకాల్ అరేంజ్మెంట్స్, బ్లాక్ కమాండోస్, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్, తదితరులకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఏర్పాట్లను చూసుకోవాలని, శానిటేషన్ పనులను సంబంధించి గుత్తి, గుంతకల్ మున్సిపల్ కమిషనర్లు మరియు డిపిఓ ఇంచార్జిగా ఉంటారని, గ్రీవెన్స్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించి డిఆర్ఓ మరియు పిజిఆర్ఎస్ తహసీల్దార్ ఇన్చార్జిగా ఉంటారని, చాలా మంది ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి విచ్చేయడం జరుగుతుందని, వారికి సంబంధించి బస చేయడానికి గుంతకల్లులో ఏర్పాట్లను చేయాలని గుంతకల్లు మరియు గుత్తి తహసీల్దార్ లను ఆదేశించారు. అత్యవసర మందులను, అత్యవసర పరికరాలను, డాక్టర్లను, నర్సులను, అంబులెన్సులు, బ్లడ్ డోనర్స్ ను, మెడికల్ టీంలు, పారామెడికల్ స్టాఫ్, హెలిప్యాడ్ మరియు సభ ప్రాంగణం వద్ద క్యాంపులను, కాన్వాయ్ నందు మెడికల్ వాహనాన్ని, ఇతర చోట్ల 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిఎంహెచ్వో, డిసిహెచ్ఎస్, జిజిహెచ్ మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బందికి హెలిప్యాడ్, కాన్వాయ్, సభా ప్రాంగణం వద్ద తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలకు 365 రోజులు పని కల్పించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం

**(3వ పేజీ తరువాయి)** టెక్స్టైల్ పార్కు సాధ్యమయిందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు లో మొదటి దశలో 22 ఎకరాల్లో మూడు నెలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తామన్నారు.. మిగిలిన 50 ఎకరాలలో టెక్స్టైల్ రిలేటెడ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశ్రామిక వాడకు ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కూడా ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు బ్రాండ్ వస్త్రాలకు మా సహకారం ఉంటుందని తెలిపారు. రిలయన్స్ కంపెనీ వారు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేతలను ఆర్థికంగా బలపరచాలనే ఉద్దేశంతో ఇలాంటి పార్కులను ఏర్పాటు చేశారన్నారు... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. చేనేత & జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి మాట్లాడుతూ టెక్స్టైల్ పార్క్ ను మొదటి ఫేస్ లో అభివృద్ధి చేయడానికి ఏపీఐఐసీ నుంచి రోడ్లు, నీటి సదుపాయాలు కల్పించేందుకు 6.9 కోట్లు నిధులు కేటాయింపు చేశారన్నారు.

ఈ 77 ఎకరాలు పార్కులో 22 ఎకరాలు చిన్న చిన్న ప్లాట్లుగా మగ్గాలు పెట్టుకోవడానికి, మిగిలిన భూమి వస్త్ర పరిశ్రమ ఏర్పాటు చేసుకోవడానికి కేటాయించుకోవడం జరిగిందని కమిషనర్ తెలిపారు.వీవర్స్ కి ఐడెంటిటీ కార్డు ఇప్పించడం జరుగుతుందని, దీని వలన ముద్ర లోన్ వస్తుందని, కరెంటు ఫ్రీగా లభిస్తుందని తెలిపారు. ఇక్కడ కేటాయించిన ప్రదేశంలో షెడ్ లాగా కట్టుకొని, క్యాంటీన్ పెట్టుకొని, డిజైన్స్ స్టూడియో పెట్టుకున్నట్లైతే 365 రోజులు పని ఉంటుందని తెలిపారు. మన మార్కెటింగ్ మనమే చేసుకుని లాభపడవచ్చునని తెలిపారు.

## కడప జిల్లా విద్యారత్నాలు పేరిట అభినందన సభ







**(3వ పేజీ తరువాయి)** సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రపంచ స్థాయి విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించారని ఈ సందర్భంగా వారిని అభినందించారు. గ్రామస్థాయి నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నత స్థాయిలోకి వెళితే మంచి లీడర్షిప్ క్వాలిటీస్ తో దేశానికి మంచి సేవ చేయగలుగుతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థి 595 మార్కులు తెచ్చుకోవడం అంత సులభం కాదని తన కృషిని ప్రోత్సహించిన తల్లి దండ్రులను, ఉపాధ్యాయులను మనస్ఫూర్తిగా అభినందించారు. సత్య నాదెండ్ల కూడా టాప్ టాపర్ కాదని నిరంతర కొత్త విషయాలు నేర్చుకోవడంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించారని, విద్యార్థులు కూడా అలాంటి గుణాన్ని అలవర్చుకుంటే ఏదైనా సాధించగలుగుతామన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల మనస్సును అర్థం చేసుకోవాలన్నారు. మీ లక్ష్యాలను వారిపై రుద్దకుండా వారి యొక్క లక్ష్యాలను సాదించడంలో తోడ్పాటును అందించాలన్నారు. సమస్యలను పరిష్కారం చేసే దిశగా విద్యార్థులను తయారు చేయాలన్నారు.

జిల్లాలోని సింహాద్రిపురం మండలం రావుల కొలను జడ్పీ హైస్కూల్ కు చెందిన పది తరగతి జోషికా పల్లేటి అత్యధికంగా 595 మార్కులు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అలాగే సిద్ధవటం మండలం జడ్పీ హైస్కూల్ కు చెందిన అతికారి పల్లవి 594 మార్కులు,పెండ్లిమర్రి మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన జడ్పీ హైస్కూల్ నీలం నాగ వీర తరుణ్ 593 మార్కులు, కాశినాయన మండలానికి చెందిన ఏపీ మోడల్ స్కూల్ బండి రామసాయి విగ్నేష్ 593 మార్కులు, వేంపల్లి మండలం రామిరెడ్డిపల్లి గ్రామం జడ్పీ హైస్కూల్ కు చెందిన రుద్ర గంగ జశ్వంత్ రెడ్డి 592 మార్కులు, బద్వేలు మండలానికి చెందిన జడ్పీ హైస్కూల్ అతికారి రక్షిత 591 మార్కులు, జమ్మలమడుగు మండలం ఎం జె పి ఏపీ బీసీ డబ్ల్యూ ఆర్ ఎస్ (బాలుర) గంజికుంట వెంకట శివ సంతోష్ 591 మార్కులు, వేముల మండలానికి చెందిన జడ్పీ హైస్కూల్ జడ కార్తీక్ 590 మార్కులు జమ్మలమడుగు మండలం జడ్పీ హైస్కూల్ కు చెందిన కోట్టం జువేరియ తహసీన్ 590 మార్కులు, తొండూరు మండలానికి చెందిన ఎంజేపి ఏపీ బి సి డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు) గంజికుంట తన్మయి 589 మార్కులు సాధించిన వారిని ఆయన అభినందించారు.

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ...జిల్లాలో మంచి మార్కుల సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ కాక ముందు ఈ జిల్లాలోనే సెకండరీ గ్రేడ్ టీచర్ గా పని చేశానన్నారు.విద్యార్థి భవిష్యత్ ను నిర్ణయించే గొప్పతనం గురువులకు దక్కుతుందన్నారు. 1వ తరగతి నుండి యూనివర్సిటీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లోనే చదివానన్నారు. తల్లి దండ్రులు ఇతరులతో పోల్చకుండా వచ్చే ఇంటర్ డిగ్రీ ఐదు సంవత్సరాలపై దృష్టి సారించి తోడ్పాటును అందించాలన్నారు. విద్యార్థులు పట్టుదల ప్రణాళికతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. డీఈవో శంషుద్దీన్ మాట్లాడుతూ...జిల్లా పది ఫలితాల్లో 80శాతం సాధించి రాష్ట్రం లో18 వ స్థానంలో వుందన్నారు.జిల్లా విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించారన్నారు. 500 నుంచి 550 మార్కుల మధ్య 1241 మంది సాధించగా 500 నుండి 590 మార్కుల మధ్య 395 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించారన్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చదివిన ప్రైవేటు విద్యా సంస్థలోని విద్యార్థులు సాధించిన అత్యధిక మార్కులకు ప్రభుత్వ పథకాలతో పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థుల మార్కులకు పెద్ద తేడా లేదని ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం అందుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. రామకృష్ణ మిషన్, విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఈవో శంషుద్దీన్,జిల్లాసోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, జెడ్పి సీఈఓ ఓబులమ్మ,సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ నిత్యానందా రాజు,ఇతర శాఖల జిల్లా అధికారులు, డిప్యూటీ డిఈఓ రాజగోపాల్ రెడ్డి,మీనాక్షిలు,వివిధ ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్లు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

# వైవీయూ డిగ్రీ పరీక్ష వాయిదా...

**కడప, పెన్ పవర్ మే 6 :** యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల బిఏ బీకాం, బీఎస్సీ, బీసీఏ, బి బి ఏ ,ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్ల కు ఈ నెల ఏడో తేదీన జరగాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు వెల్లడించారు. ఈనెల 7వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఐసెట్ పరీక్ష ఉందన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, యోగివేమన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వాయిదా వేసిన పరీక్షలను ఇదే నెల 23వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

## త్వరలోనే స్కిట్ కాలేజీ ప్రారంభం: బొజ్జల



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 6 :** తన తండ్రి గోపాలకృష్ణా రెడ్డి లేని లోటు అందరికీ స్పష్టంగా కనిపిస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక పీఆర్ గెస్ట్ హౌస్లో ఆయన మాట్లాడుతూ.. 'మా నాన్న చనిపోకుండా ఉంటే మేము చేసే మంచి పనులు చూసి సంతోషించే వారు. సత్యవేడుకు మంత్రి నారా లోకేశ్ రానున్నారు. స్కిట్ కాలేజీ గురించి ఆయనతో మాట్లాడి ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే అన్నారు.

## 60 సం..లు వయసు దాటిన మున్సిపల్ కార్మికులను తొలగించడం సరైన నిర్ణయం కాదు..!!




**కడప/పెన్ పవర్/, మే.6 :** కడప జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులను 60 ఏళ్లు దాటిన వారిని రావద్దని సూచించడం. సరైన నిర్ణయం కాదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ జిల్లా కోశాధికారి గోపి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. .ముఖ్యంగా తాతల ముత్తాతల కాలం నుంచి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను 60 సంవత్సరాల వయసు దాటిన వారినిరావద్దని చెప్పడం ,జీతాలు పెట్టొద్దని చెప్పడం సరైనది కాదని తెలిపారు. ప్రస్తుతం ఉన్నటువంటి పాలకులు అన్ని రకాల ఉద్యోగుల వారిని 62 సంవత్సరాల వరకు పెంచిందని గుర్తుచేశారు అయితే మున్సిపల్ కార్మికులను 60 ఏళ్లకే ఇండ్లకు పంపడం సరైన కాదన్నారు. ఒకవేళ రిటైర్మెంట్ చేయదలుచుకుంటే ఒక వర్కర్ కు 10 లక్షలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, నెలకు పదివేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వృత్తి మీదనే ఆధారపడి వయసంత ఇక్కడే పని చేశారని తెలిపారు. అలాంటి వారిని ఉత్తచేతులతో ఇంటికి పంపడం దారుణం అని తెలిపారు. కాబట్టి పాలకులు మున్సిపల్ మినిస్టర్ అందుకు సంబంచిన అధికారులు, జోక్యం చేసుకొని 62 సంవత్సరాల వరకు కొనసాగించలాన్నారు. రిటైర్ అయినటువంటి వారికి అన్ని రకాల బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బి.యస్.ఎన్.ఎల్.అడ్వైజరీ కమిటీలో దళిత మహిళకు చోటు..

**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపిన సునీత**



**చిత్తూరు/పెన్ పవర్/మే 6 :** బి.యస్.ఎన్.ఎల్.అడ్వైజరీ కమిటీలో దళిత మహిళ సునీతకు చోటు దక్కింది. తన భర్త. టీడీపీ నాయకుడు సౌందర్య రాజు సహకారంతో సామాజిక కార్యక్రమాలతో పాటు తెలుగు దేశం పార్టీ బలోపేతానికి అందించిన సేవలను గుర్తించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, సునీతకు టీ.ఏ.సీ.అడ్వైజరీ కమిటీలో పనిచేసే అవకాశం కల్పించాలని కోరుతూ.., కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు లేఖ రాశారు. స్పందన కేంద్ర సమాచార, సాంకేతిక శాఖా మంత్రి జ్యోతిరాధిత్య సింధియా.ఆమెకు బి.యస్.ఎన్.ఎల్.అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా పని చేసే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సహకరించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును మంగళ వారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన సునీత,పుష్పగుచ్ఛాన్ని అందించి, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.



సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళను భవిష్యత్ తరాలకు అందిస్తున్న టిటిడి

# పార్కుకు భూమి పూజ చేసిన వివిధ శాఖ మంత్రులు







**ఎమ్మిగనూరు, పెన్ పవర్, మే 6 :** ఎమ్మిగనూరు మండలం బనవాసిలో ఎంఎస్ ఎంఈ పార్కు భూమి పూజ సందర్భంగా నిర్వహించిన సభలో పాల్గొన్న రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, చేనేత&జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, చేనేత&జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

# ఈ శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు





**కర్నూల్ పెన్ పవర్ మే 6 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు గౌరవ జి.కబర్ధి వారి సూచనల మేరకు బి.లీలా వెంకట శేషాద్రి,కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు మంగళవారం స్థానిక ఎంపీడీఓ మీటింగ్ హాల్, కర్నూలులో గవర్నమెంట్ స్కూల్స్ నందు మధ్యాహ్న భోజన పథకానికి వంట చేసే వారు వారి సహాయకులకు ఈ శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు.

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి ఈ శ్రామ్ కార్డులు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హేమాద్రి,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గారు వీరికి ఈ శ్రామ్ కార్డులు ఈ శ్రామ్ పోర్టర్ లో ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు. ఈ కార్డులు పొందిన వారికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రతా పథకాలు వివిధ సంక్షేమ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. మరియు ప్రతి ఒక్క కార్మికునికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రెండు లక్షల ప్రమాద మరణ బీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందని తెలిపారు. మొత్తం 74 మంది కి ఈ సదస్సు లో ఈ శ్రమ్ కార్డ్స్ అందించా మని తెలిపారు. ఈ కార్యక్రమం మండల్ ప్రజా పరిషత్ ఆఫీసర్ రఘునాథ్, డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీస్ డిసిబి సెక్రటరీ నాగరాజు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్లు వసంత లక్ష్మి, విజయకుమారి ల ఆధ్వర్యంలో విజయవంతమైనదని జడ్జి గారు తెలిపారు. ఉచిత ఉచిత న్యాయ సహాయం లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై వారికి అవగాహన కల్పించారు.

## ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు స్థలాలు : కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల, పెన్ పవర్ మే 06 :** జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆర్డీఓలు, తహశీల్దార్లను ఆదేశిం చారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇంటిగ్రేటెడ్ రూరల్ ఎనర్జీ ప్రోగ్రాంలో భాగంగా ప్రభుత్వ భూముల స్థలసేకరణ పై ఆర్డీఓలు, తహశీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, నంద్యాల, ఆత్మకూర్, డోన్ ఆర్డీఓలు విశ్వనాథ్, నాగజ్యోతి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఎంఎస్ ఎంఈ పార్క్ ల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూముల స్థల సేకరణ చేపట్టాలని ఆర్డీఓలను, తహశీల్దార్లను ఆదేశించారు. పాణ్యం, సుగాలిమెట్ట ప్రాంతాలలో 50 ఎకరాల ప్రభుత్వ భూమి అందు బాటులో ఉందని, డోన్ మండలం ఉంగరాలగుట్ట ప్రాంతంలో కూడా 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని సంబంధిత ప్రాంతాలలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాల పై ఎపిఐఐసి జోనల్ మేనేజర్ తో కలిసి పరిశీలించాలని నంద్యాల, డోన్ ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఆత్మకూరు మండలంలో కూడా ప్రభుత్వ భూములు 2.5 ఎకరాల మేర ఉంటే పరిశీలించాలని ఆత్మకూరు ఆర్డీఓను ఆదేశించారు. రిలయన్స్ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాలో 5 వేల ఎకరాలను గుర్తించి నివేదికలు ఇవ్వగా అందులో 765 ఎకరాల్లో ఏర్పాటు చేయడానికి రిలయన్స్ సంస్థ నుండి అంగీకారం రావడం జరిగిందన్నారు. అందులో గడివేములలో 300 ఎకరాలు, చాగలమర్రిలో 105 ఎకరాలు, రుద్రవరంలో 190 ఎకరాలు, ఆళ్లగడ్డలో 170 ఎకరాలు ఉన్నాయని, సదరు భూముల్లో ఎలాంటి ఆక్రమణలు వున్నా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. పిఎం కుసుమ్ సంబంధించి పాణ్యం, నంద్యాల, గోస్పాడు, జూపాడుబంగ్లా, భానుముక్కల, ప్యాపిలి మండలాల్లో 10 ఎకరాల మేరకు ప్రభుత్వ భూములు పరిశీలించి సబ్ స్టేషన్ల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**కడప, పెన్ పవర్ మే 6 :** జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కూడా అంతరాయం జరగకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. ఏపీఎస్పీడిసిఎల్ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అందులో ఏపీఎస్పీడిసిఎల్ కడప జిల్లా పరిధిలో పునర్వ్యవస్థీకరించిన విద్యుత్ పంపిణీ రంగ పథకం మార్గ దర్శకాలకు అనుగుణంగా – జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాలు అభివృద్ధి, అనుబంధ శాఖల సమన్వయం తదితర ప్రధానాంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని రానున్న రెండు నెలలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎలాంటి కొరత రాకుండా ప్రత్యేక, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కడప నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే, ఏవైనా అవసరం అయితే ప్రతిపాదనలను అందజేసి.. త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. కమలాపురం నియోజకవర్గంలో – రైతులకు వ్యవసాయ అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో, ఇండ్లపైన – హైటెన్షన్ – 11 కెవి– 240 వోల్టుల విత్యుత్ లైన్ల తొలగింపునకు విద్యుత్ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా.. వ్యవసాయ అవసరాలకు విద్యుత్ పరికరాలు గానీ, మౌలిక సదుపాయాలు గానీ, విద్యుత్ సరఫరాను లాభాపేక్ష లేకుండా చేపట్టాలన్నారు. రైతుల నుండి విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అదనపు వసూళ్లకు పాల్పడకూడదని హెచ్చరించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి అధికారి – రైతులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక అవస రాలకు, ఇరిగేషన్ అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సూర్యఘర్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి.. విద్యుత్ ఆదాకు సహకరిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ రమణ, ఏఈ లు, డీఈలు, జేఈలు అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీఓ ఎల్. బ్రహ్మయ్య



**పామూరు, పెన్ పవర్, మే5 :** ఉరుములు మెరుపులు పిడుగులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎల్. బ్రహ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు రానున్న 3 రోజులు అనేకచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఏ తమిమ్ అన్సారీయా అదేశాల మేరకు పిడుగులపై అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించనునట్లు తెలిపారు. ఆ మేరకు పిడుగులు పడే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి సచివాలయంలో ప్లెక్సీలు వేయించి, ప్రజలలో అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. చర్చిలు, దేవాలయాలు, మసీదులపై మైకులను ఉపయోగించుకొని, పిడుగుపాటుపై గ్రామాల్లో దండోరా వేయించడం ద్వారా జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీఓ అన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు చేపట్టాలి

### జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ





**అనంతపురం, పెన్ పవర్ మే 06 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం లోని వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను, గ్రామసభ వద్ద ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలి ప్యాడ్ వద్ద త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అనంతపురం ఆర్డీవో, ఆర్.అండ్.బి ఎస్ఈలను ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ బ్రిడ్జి వద్ద అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈకి సూచించారు. గ్రామసభ ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకోవాలని గుంతకల్ ఆర్డీవోని ఆదేశించారు. డిపిఓ, మున్సిపల్ కమిషనర్ లు శానిటేషన్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమం సందర్భంగా తాగునీటి ఏర్పాట్లు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కోసం ఆయా శాఖల అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు కేశవ నాయుడు, శ్రీనివాస్, డిపిఓ నాగరాజు నాయుడు, జిల్లా పరిషత్ సీఈవో రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్.అండ్.బి ఎస్ఈ రాజగోపాల్, డిఎల్డివోలు లలితా బాయి, విజయలక్ష్మి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ల పేరుతో బీసీలను దగా చేస్తున్న కూటమి సర్కార్



**పలమనేరు మే 5, (పెన్ పవర్) :** కుట్టు మిషన్ల పేరుతో బీసీలను కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని రాష్ట్ర వైఎస్సార్సీపీ విశ్వ బ్రాహ్మణ అనుబంధ విభాగం అధ్యక్షురాలు పవిత్ర మురళీకృష్ణ ఆరోపించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ..బీసీ మహిళలకు చేయూత కింద ఇచ్చే కుట్టు మిషన్లను కూడా సక్రమంగా అందిస్తుందన్న నమ్మకం లేదన్నారు.కూటమి ప్రభుత్వ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాసిరకమైన కుట్టు మిషన్లతో లబ్ధిదారులను పెంచి చూపించి సుమారు రూ.245 కోట్లను ప్రభుత్వం దోచుకుతింటోంది ఆరోపించారు. ఇందులో ప్రదానంగా ఒక్కో మహిళకు రూ.23వేలు కేటాయించగా, కుట్టుమిషన్ కొనుగోలుకు కేవలం రూ.4,300, టైలరింగ్ శిక్షణకు రూ.3వేలు అని, ఇలా ఒక్కో బీసీ లబ్ధిదారురాలికి కుట్టు మిషన్, శిక్షణకు అయ్యే మొత్తం ఖర్చు రూ.7,300 మాత్రమేనని అన్నారు.లక్ష మంది లబ్ధిదారులకు రూ.73 కోట్లు మాత్రమే ఖర్చు కాగా,మొత్తం విలువ రూ.245 కోట్లు పెట్టడం కూటమి ప్రభుత్వ అవినీతి తేటతెల్లం అయ్యిందని ధ్వజమెత్తారు.కంటికి కనిపించే విధంగా ఇలా కోట్లాది రూపాయలను మధ్యలో బొక్కేస్తున్నట్లు తెలుస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు.

# భేష్...... మంత్రి సవితమ్మ



**డోన్/కర్నూలు పెన్ పవర్ మే 6 :** రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మరోసారి మానవత్వాన్ని చూపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కు దగ్గరుండి ప్రాథమిక వైద్యమందించి, సపర్యలు చేయించారు. 108 వాహనానికి ఫోన్ చేసి, క్షతగాత్రులను తరలించారు. మంత్రి సవిత సహాయక చర్యలను స్థానికులు, వాహనదారులు కొనియాడారు. మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత డోన్ లో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని పెనుకొండకు తిరిగి పయనమయ్యారు. అదే సమయంలో డోన్ సమీపంలో బుచ్చయ్యగారిపల్లె నుంచి హైదరాబాద్ కు మామిడి కాయల లోడ్ తో వెళుతున్న వ్యాన్ ఓబిలాపురం సమీపంలో టైర్ పేలిపోవడంతో బోల్తా పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ కు గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న మంత్రి సవిత...తన కాన్వాయ్ ను ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. 108 వాహనంలో వచ్చేలోగా, తన కాన్వాయ్ లో ఉన్న ప్రథమ చికిత్స కిట్ తో క్షతగాత్రులకు తన సిబ్బందితో వైద్య సాయమందించారు. డోన్ ప్రభుత్వాసుపత్రి వైద్యులతో మాట్లాడి, మెరుగైన వైద్యమందించాలని మంత్రి ఆదేశించారు. స్వల్ప గాయాలయ్యాయని, ప్రమాదం ఏమీ లేదని క్షతగాత్రులను ఓదార్చి పెనుకొండకు మంత్రి సవిత పయనమయ్యారు. ప్రమాదం జరిగిన విషయాన్ని గుర్తించిన వెంటనే, కాన్వాయ్ ను ఆపి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించిన మంత్రి సవితపై స్థానికులు, వాహనదారులు ప్రశంసలు కురిపించారు.

# కిషోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రూతుశ్రావంపై అవగాహన సదస్సు



**సోమల/పెన్ పవర్/మే 6 :** కిషోరీ వికాసం సేషన్ 2 భాగంగా మంగళవారం కిషోర బాలికలకు పంచాయతీ కార్యదర్శి జయశంకర్, మహిళా పోలీస్ గౌరీ జగన్నాథం వ్యక్తిగత పరిశుభ్రత, రూతుశ్రావం పై అవగాహన సదస్సు నిర్వహించారు. కిషోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమ ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సచివాలయాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కందూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన కిషోర్ బాలబాలికలతో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, మహిళా పోలీస్ గౌరీ జగన్నాథం తదితరులు మాట్లాడుతూ 11-19 మధ్య వయస్సు అత్యంత కీలకమైనది పిల్లలలో అనేక మార్పులు వస్తాయని, ఈవయస్సులో వచ్చే ఆలోచలను అదుపులో పెట్టుకోవాలని, మంచి మార్గంలో ముందుకు నడవాలని వివరించారు. వ్యక్తిగత శుభ్రత వివరిస్తూ బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలు క్రమశిక్షణగా మెలగాలని, తల్లితండ్రులను గౌరవించి నడుచుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, కిషోరి బాలబాలికలు, మహిళా పోలీస్ గౌరీ జగన్నాథం, ఏఎన్ఎంలు, రిటైర్ టీచర్ రాంనారాయణ, ఉపాధ్యాయలు వాసు, సాయిచరణ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ముబారక్, ఏ డబ్ల్యు సి, ఆశ వర్కర్స్, పిల్లల తల్లులు హాజరు అయ్యారు.

## తెల్ల, నల్ల బర్లి పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### సిపిఎం జిల్లా నాయకులు వి.బాలకోటయ్య




**గిద్దలూరు పెన్ పవర్ మే 6 :** గిద్దలూరు ప్రాంతంలో వేసిన పోగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బాలకోటయ్య డిమాండ్ చేశారు. నాయకులు సిపిఎం పార్టీ గిద్దలూరు ఏరియా సమావేశం స్థానిక సిపిఎం కార్యాలయంలో బి పూర్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు వి బాలకోటయ్య పాల్గొని మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో తెల్ల, నల్ల బర్లి పొగాకు ఎక్కువ సాగు చేయడం జరిగిందని తెల్ల, నల్ల బర్లి పొగాకు ప్రభుత్వం కనీసం మద్దతు ధర కింటాకు 15 వేల రూపాయలు ధర కల్పించి , ప్రభుత్వమే కొనుగోలు చేసి ఈ ప్రాంత పొగాకు రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు పండించిన పొగాకును అమ్మేందుకు వేలంకేంద్రం దగ్గరికి తీసుకుపోవడంతో అక్కడ కొనుగోలు చేయక ఆ రైతు రవాణా ఖర్చులు భారంగా మారి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పొగాకు వేలం కేంద్రాలలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి పొలాలలో ఉన్న పాకలలో ఉన్న పొగాకు గాలి వానకు తడిసి పొగాకు రంగు పాడైపోతుందని, రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు టి.ఆవులయ్య, బి.నర్సింహులు డి.తామస్ పాల్గొన్నారు.

## పిడుగుపాటు నుంచి కాపాడుకునేందుకు తగు జాగ్రత్త తీసుకోవాలి



**కొమరోలు పెన్ పవర్ మే 6 :** బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఆవర్తన ధ్రోని ప్రభావంతో ఉరుములు మెరుపులతో కురుస్తున్న వర్షాలతో పాటు పిడుగులు కూడా పడే అవకాశాలు ఉన్నాయంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేస్తున్నదని కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి, కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డిప్యూటీ ఎంపీడీవో దేవరశెట్టి బ్రహ్మయ్య ప్రజలకు వివరించారు. ఆ సందర్భంగా కొమరోలు పట్టణంలోనూ, ద్వారక చర్ల గ్రామంలోనూ పిడుగుల పాటు వలన కష్టనష్టాలను ప్రాణహాని పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. కొమరోలు లోని ఆంజనేయస్వామి ఆలయ కూడలిలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ధ్రోని ప్రభావంతో ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. ఉరుములు మెరుపులతో పాటు పిడుగులు కూడా పడే అవకాశాలు ఉన్నాయని అందువలన ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తూ హెచ్చరించారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు ఇంటిలో ఉండటం శ్రేయస్కరం అన్నారు. సముద్రం, కొలనులు, సరస్సులు, చెరువుల దగ్గర ఉండే పరిస్థితులు ఏర్పడితే వెంటనే వాటికి దూరంగా ఉండాలన్నారు. రేకు, లోహం కలిగిన నిర్మాణాలకు దూరంగా ఉండాలన్నారు. ఉరుముల శబ్దం వినగానే పొలాల్లో పని చేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, పశు కాపరులు, గొర్రెలకు కాపరులు వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలి. కారు, బస్సు లోపల ఉండేవారు అన్ని డోర్స్ మూసి ఉంచాలి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు మీ మెడ వెనుక జుట్టు నిక్కబొడటం, లేదా చర్మం జలదరింపు ఉంటే మెరుపు పిడుగులు రావడానికి సూచనగా భావించండి .బహిరంగ ప్రదేశాల్లో ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేకుంటే రబ్బరు చెప్పులు ధరించి, చెవులు మూసుకుని, తలను నేలకు తగలకుండా మోకాలి పై కూర్చోవాలని సూచించారు. దీనివలన ఉరుములు మెరుపుల నుండి రక్షణ పొందే అవకాశం ఉంటుందని వారు చెప్పారు. ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసి ఉంచండి, ఉరుముల శబ్దం ఆగిపోయిన తరువాత కూడా 30 నిమిషాల పాటు ఇంట్లోనే ఉండి రక్షణ పొందాలని వారు వివరించారు. పిడుగు బాధితులను తాకవచ్చు .సత్వరమే వారికి సహాయం అందించండి. పిడుగుపాటు గురైన బాధితులను వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వారి ప్రాణాలు కాపాడేందుకు సహకరించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు .కాగా పిడుగుపాటు సమయంలో తీసుకోవలసిన మరికొన్ని జాగ్రత్తలను కూడా వారు వివరించారు. ఉరుములు మెరుపులు సంభవించినప్పుడు చెట్ల కింద ,చెట్ల సమీపంలో ,టవర్లు, చెరువుల దగ్గర ఉండరాదు .ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్ వస్తువులు, ఇతర పరికరాలు చార్జ్ ఫోన్లు ,మొబైల్ వినియోగించవద్దని వారు సూచించారు. పిడుగు పడే సమయంలో స్నానం చేయడం, చేతులు కడగటం ,నీటిలో ఉండటం లాంటివి చేయరాదని వారు హెచ్చరించారు.

# తిరుమలలో వైభవంగా శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు ప్రారంభం

## భూలోక వైకుంఠాన్ని తల పించిన “దశావతార - అష్టలక్ష్మి మండపం”






**తిరుమల పెన్ పవర్ మే 6 :** తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో వివిధ సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో అలంకరించిన “ దశావతార – అష్టలక్ష్మి “ మండపంలో మంగళవారం సాయంత్రం శ్రీ పద్మావతి శ్రీనివాస పరిణయోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. మే 8వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఒక టన్ను పండ్లు, 2 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్ తో 150 మంది గార్డెన్ సిబ్బంది, 50 మంది ఎలక్ట్రిక్ సిబ్బంది కలిసి మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

**మొదటిరోజు వైశిష్ట్యం :** శ్రీ పద్మావతి పరిణయోత్సవాల్లో మొదటి రోజు అంటే వైశాఖశుద్ధ నవమిరోజైన మంగళవారం శ్రీ మలయప్ప స్వామివారు గజవాహనాన్ని అధిరోహించగా ఉభయనాం చారులు పల్లకిపై పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. వివిధ హంగు లతో శోభిల్లుతున్న ఈ పెండ్లిమండపంలో నిత్య నూతన వధూవరులైన శ్రీ స్వామివారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు, మాల పరివర్తనం, పూలబంతులాట, నూతన వస్త్ర సమర్పణ కోలాహలంగా జరిగాయి. ఆ తరువాత శ్రీ స్వామివారికి కొలువు (ఆస్థానం) జరిగింది. ఈ క్రతువుల అనంతరం చతుర్వేద పారాయణం, మలహారి, దేశిక, సౌరాష్ట్ర, వారహి, కదన కుతూహల, నీలంబారి వంటి వివిధ రాగ– తాళ–వాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పిదప ఆర్జిత భక్తులకు వస్త్ర బహుమానం, ప్రసాద వితరణ జరిగింది. ఆ తరువాత శ్రీదేవి భూదేవి సహితుడైన స్వామి అశేష భక్తజనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో తొలిరోజు వివాహ వేడుక ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.










# ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

- గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు - యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం - అర్జీల స్వీకరణలో ఎమ్మెల్యే ఏలూరి



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 06 :** ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత అని సమస్యల పట్ల అధికారులు సత్వరమే స్పందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారుల ఆదేశించారు.భూ సమస్యల పరిష్కారానికి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా పనిచేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రచించారని అధికారులు సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. యువత ఆయన రంగాలలో మెలుకువలు , శిక్షణ పొందాలని సూచించారు. రానున్న రోజుల్లో 20 లక్షల మందికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. యువత తమలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శిక్షణ పొందాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాజధాని అమరావతి నిర్మాణం పరుగులు తీస్తుందని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తుందన్నారు. యువత ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు.

## కిషోర బాలికలకు బాల్య వివాహాలపై, బాలల అక్రమ రవాణాపై అవగాహన




**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 6 :** వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా పై అవగాహన కల్పించాలి అని లీగల్ అధికారి రత్న ప్రసాద్ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సిడిపిఓ దేవకృపావరం అధ్యక్షతన మహిళా పోలీసులకి, ఎం పి హెచ్ లు, అంగన్వాడి కార్యకర్తలకి, ఆశా కార్యకర్తలు, వివో ఏలు లకు కిషోరి వికాసం ప్రోగ్రాం పై అవగాహన కల్పించినారు.

ఈ సందర్భంగా ఐసిపిఎస్ లీగల్ రత్న ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి , డాక్టర్ హెూమ లు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు గ్రామస్థాయిలో 5 గురు కమిటీ సభ్యులు కిశోర బాలికలను గుర్తించి 10 లేక 15 మందిని గ్రూపుగా చేసి వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, నైతిక విలువలు, ట్రాఫికింగ్, గుడ్ టచ్ –బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వివో ఏలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అజీజ్ ఆధ్యాత్మిక సాహిత్య సేవలు మరువలేనివి



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 06 :** ఇస్లామ్, హిందూ మత ధర్మాలకు సమ ప్రాధాన్యత నిచ్చి ఇటు మసీదుల్లోను, అటు దేవాలయాల్లోను పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా సంగీత సాహిత్య పౌరాణిక నాటక రంగ కార్యక్రమాల నిర్వహణలో తను వంతు చేయూతనందించిన ఆధ్యాత్మిక సాహిత్య రంగ సేవకులు షేక్ అజీజ్ నేటి తరానికి ఆదర్శప్రాయులని పలువురు పేర్కొన్నారు. దివంగతులైన షేక్ అజీజ్ సంస్మరణ సభ శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులుమిడసల మల్లికార్జున రావు ఆధ్వర్యంలో స్థానిక సీవీయన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో జరిగింది. తొలుత వివిధ రంగస్థల, సాహిత్య సంస్థల ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పుష్ప మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి మిరియాల వెలుగొండయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సివిఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఈదుపల్లి గుర్నాథరావు, కోడూరు రాధాకృష్ణలు, క్లబ్ ఉపాధ్యక్షులు రామిరెడ్డి నితిన్ రెడ్డి, కోశాధికారి ఆరిగ వీర ప్రతాప్, కార్యవర్గ సభ్యులు కరేటి కిరణ్ బాబు, నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి, కనుమాల రాఘవులు, లలిత కళా అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు, వివిధ సంస్థల ప్రతినిధులు మెద బలిమి సాంబశివరావు, అంగలకుర్తి ప్రసాద్, షేక్ మహబూబ్ జాన్ కొప్పోలు వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, పెద్దిశెట్టి సుబ్బారావు అయినంపూడి నరసింహం, అజీజ్ కుమారులు షేక్ షబ్బీర్, షేక్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 332వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు



**పామూరు, పెన్ పవర్, మే5 :** కాలజ్ఞాన తత్వవేత్త, రాజయోగి, సంఘసంస్కర్త, కలియుగ దైవం జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన గురూపూజ మహోత్సవాలను ఈరోజు పట్టణంలోని విరాట్ నగర్ లో వేంచేసి ఉన్న గోవింద మాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానంలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజాము నుంచి స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, సహస్రనామార్చనలు, విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన, తీర్థ ప్రసాదాలు, అలాగే విచ్చేసిన భక్తులకు మహా అన్న వితరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని కమిటీ వారు తెలిపారు. సాయంత్రం 5గంటలకు కనక తప్పెట్ల తో, మేళా తాళాలతో పట్టణ పురవీధుల్లో గోవింద మాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కమిటీ వారు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌కు సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ పరామర్శ, ఆర్థిక సహాయం



**పెద్ద దోర్నాల పెన్ పవర్ మే 5 :** మండలంలోని పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ బట్టు శేఖర్ రెడ్డి ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్పందించిన సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మరియు వైఎస్ఆర్ సీపీటీయూసీ అధ్యక్షుడు షేక్షావలి సంఘటితంగా సంఘసభ్యులతో కలిసి శేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా షేక్షావలి మాట్లాడుతూ,శేఖర్ రెడ్డి మాదిరిగా రోడ్లపై ప్రాణాల పెట్టి కుటుంబాలను పోషిస్తున్న డ్రైవర్ల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పాటుపడుతోంది. యూనియన్ సభ్యుడిగా శేఖర్ రెడ్డి సాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం అన్నారు. అనంతరం శేఖర్ రెడ్డికి యూనియన్ తరపున రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించారు. గాయాలపై తగిన వైద్య చికిత్స అందించేందుకు అవసరమైన మద్దతు అందిస్తామని, ఆరోగ్యం తిరిగి పొందేంతవరకూ కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మా మద్దతు ఎల్లప్పుడు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బట్టు వెంకట్ నారాయణ రెడ్డి, కాశయ్య నారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి బాధ్యత ఆర్కేకే



**విజయవాడ , మే 6, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో అమరావతి రాజధాని నిర్మాణాన్ని నిలిపివేశారు. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. అయితే ఈ విషయంలో ముందడుగు వేయలేకపోయారు. అమరావతిని నిర్వీర్యం చేశారని విమర్శను మూటగట్టుకున్నారు. ఇప్పుడు అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో.. ఏం చేయాలో జగన్మోహన్ రెడ్డికి అంతు పట్టడం లేదు. ఇటువంటి సమయంలో ఓ కీలక నేత సాయం తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అమరావతివిషయంలో ఎలా ముందుకు వెళ్లాలి అన్న దానిపై వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి మల్లగుల్లాలు పడుతున్నారు. తాను వ్యతిరేకించిన అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇది ఒక విధంగా జగన్మోహన్ రెడ్డికి ఎదురైన పెద్ద దెబ్బ. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో అమరావతి రాజధాని నిర్మాణాన్ని నిలిపివేశారు. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. అయితే ఈ విషయంలో ముందడుగు వేయలేకపోయారు. అమరావతిని నిర్వీర్యం చేశారని విమర్శను మూటగట్టుకున్నారు. ఇప్పుడు అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో.. ఏం చేయాలో జగన్మోహన్ రెడ్డికి అంతు పట్టడం లేదు. ఇటువంటి సమయంలో ఓ కీలక నేత సాయం తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. అయితే అప్పట్లో జగన్మోహన్ రెడ్డి సైతం సమ్మతించారు. తాను వ్యతిరేకించినా అమరావతి రాజధానిగా ఎంపిక ఆగదని అంచనాకు వచ్చారు. అమరావతిని వ్యతిరేకిస్తే రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని జగన్ మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే ఆ సమయంలో మంగళగిరి ఎమ్మెల్యే గా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డి సేవలను వినియోగించుకున్నారు. అమరావతికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు రైతులు. కానీ అక్కడక్కడ కొంతమంది రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అటువంటి వారిని కూడా తీసుకొని ఆళ్ల రామకృష్ణారెడ్డి న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేయించేవారు. కోర్టు నుంచి వ్యతిరేక తీర్పులు వచ్చేవి. దీంతో దానిపై విస్తృతంగా ప్రచారం చేసేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. సోషల్ మీడియా వేదికగా విషం ప్రయత్నం చేసేది. అప్పట్లో ఇది రాజకీయంగా బాగా వర్కవుట్ అయ్యింది. అందుకే మరోసారి అదే ఫార్ములాను అనుసరించాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో మంగళగిరినుంచి ఆళ్ల రామకృష్ణారెడ్డిని తప్పించారు జగన్మోహన్ రెడ్డి. బీసీ ప్రయోగం చేస్తూ కాండ్రు కమల అనే మహిళ నేతకు టికెట్ ఇచ్చారు. కానీ నారా లోకేష్ 90 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అయితే ఆళ్ల రామకృష్ణారెడ్డి జగన్మోహన్ రెడ్డి పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. కొద్ది రోజులకే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మంగళగిరి నియోజకవర్గంలో ప్రచారం చేశారు కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. అయితే ఇప్పుడు అమరావతి రాజధాని నిర్మాణం ప్రారంభమైన నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి కొత్త నిర్ణయం తీసుకున్నారు. తిరిగి ఆళ్ల రామకృష్ణారెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ మేరకు సూత్రప్రాయంగా నిర్ణయించుకున్న జగన్ ప్రకటనకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ల పై విమర్శలు చేస్తున్నారు. అమరావతి నిర్మాణాన్ని ఆపలేకుండా పార్లమెంట్లో చట్టం చేయనున్నారు. అది జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసు. అందుకే అమరావతి నిర్మాణంలో అవినీతి, వైఫల్యాలను బయటకు తీసే బాధ్యతను ఆళ్ల రామకృష్ణారెడ్డికిజగన్ అప్పగించినట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించి.. అమరావతి పై ఫుల్ ఫోకస్ పెట్టే బాధ్యతను ఆళ్ల రామకృష్ణారెడ్డికి అప్పగించనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే ఆళ్ల రామకృష్ణారెడ్డి అవసరం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి ఏర్పడింది. అందుకే పిలిచి మరి బాధ్యతలు కట్టబెడుతున్నారు.

# మళ్లీ సిద్ధార్థ సంస్థలకే దేవాదాయ భూములు

## పని చేసిన కులం కార్డు

**విజయవాడ, మే 6, పెన్ పవర్:** ఏపీలో లీజుల మాటున అన్యాక్రాంతమవుతున్న దేవుడి ఆస్తుల్ని వాటి అనుభవదారులకే కట్టబెట్టేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న భూములు అన్యాక్రాంతమవుతున్నా ఆ శాఖ వాటిని కాపాడే ప్రయత్నాలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. లీజుల్ని పొడిగిస్తే అవి ఎప్పటికీ దేవుళ్లకు దక్కవని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వం ఖాతరు చేయడం లేదుఇటీవల విజయవాడలో ప్రముఖ విద్యా సంస్థలకు దేవాదాయ శాఖ భూమి లీజును పొడిగించే అంశం వెలుగు చూసింది. నగరం నడిబొడ్డున వందల కోట్ల ఖరీదు చేసే దుర్గగుడి ఆలయ భూముల్ని నామమాత్రపు ధరతో 50ఏళ్ళ పాటు లీజుకు ఇచ్చే ప్రతిపాదనల్ని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు అడ్డుకున్నారు. వ్యాప్తంగా దేవాదాయ శాఖకు ఉన్న భూములపై సమగ్రంగా సర్వే జరిపించడంతో పాటు కొత్త లీజుల్ని పొడిగించడానికి సర్వే చేపట్టాలని ఆదేశించినా ఫలితం లేకపోయింది. బెజవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి చెందిన విలువైన భూముల్ని లీజుకు ఇవ్వడానికి ఏకంగా నిబంధనల్ని సవరిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. న్యాయపరమైన అభ్యంతరాలు తోసిపుచ్చి జారీ చేసిన జీవో చర్చనీయాంశంగా మారింది. ఏపీలో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న వేల ఎకరాల భూముల్లో విలువైన భూములన్నీ రాజకీయ నేతల సిఫార్సులతో కూడిన లీజుల్లోనే ఉన్నాయి. వీటిపై నామ మాత్రపు ఆదాయం మాత్రమే సమకూరుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 139 వివాదాస్పదం అవుతోంది. దేవాదాయ శాఖలో ప్రస్తుతం పూర్తి స్థాయి కమిషనర్ లేరు. ఐఏఎస్ అధికారులు విధులు నిర్వర్తించాల్సిన శాఖలో దుర్గగుడి ఈవోకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో ఏప్రిల్ 17న దేవాదాయ శాఖ ఇంఛార్జి కమిషనర్ హెూదాలో ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ హిందూ ధార్మిక సంస్థలు, దేవాదాయ సంస్థల స్థిరాస్తుల లైసెన్స్ నిబంధనలు 2003లో మార్పుల చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఏపీలో ఛారిటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థలకు భూముల్ని కేటాయించే విషయంలో నిబంధనల్ని సడలించాలని ఆ లేఖల పేర్కొన్నారు. ఇంఛార్జి కమిషనర్ లేఖపై ప్రభుత్వం ఆగమేఘాలపై స్పందించింది. ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోని వ్యవసాయేతర భూముల లీజుల నిబంధనల్ని సడలిస్తూ జీవో జారీ చేశారు. దేవాదాయ భూముల లీజుల్లో ఉన్న నిబంధనల్లో మార్పులు చేసేలా సబ్ క్లాజ్‌లను చేర్చారు. దీని ప్రకారం ఏపీ ఛారిటబుల్ అండ్ హిందూ మత సంస్థల చట్టం 1987 సెక్షన్ 2(5) ప్రకారం గుర్తించిన ప్రముఖ సంస్థలు ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, లాభాపేక్షరహితంగా సేవా కార్యక్రమాలను 20ఏళ్లకు పైబడి నిర్వహిస్తుంటే వారికి లీజుల్ని పొడిగించడం, బహిరంగ వేలం లేకుండానే భూముల్ని కేటాయించడం, నామమాత్రపు ధరకు భూముల్ని కేటాయిస్తారు. అయా సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను సజావుగా కొనసాగించేందుకు

ఈ నిబంధనలు చేరుస్తున్నట్టు జీవో దేవాదాయ శాఖ పేర్కొంది. దేవాదాయ శాఖ జారీ చేసిన జీవో నంబర్139 కొన్ని సంస్థలకు లబ్ది చేకూర్చడానికేనని అనుమానాలు ఉన్నాయి. విజయవాడలో ప్రముఖ విద్యా సంస్థ యాభై ఏళ్లుగా దుర్గగుడి భూముల్ని లీజుకు తీసుకుంది. మరో యాభై ఏళ్లకు లీజుకు ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని దేవాదాయ శాఖ లీగల్ విభాగం అభ్యంతరం వ్యక్తం చేసింది. వందేళ్లకు పైబడిలీజులో ఉంటే అయా సంస్థలకే యాజమాన్య హక్కులు లభిస్తాయని, దేవాదాయ శాఖ నష్టపోతుందని అభ్యంతరం వ్యక్తం చేసింది. లీజు ముగియడంతో వాటిని 7ఏళ్ల లోపు గడువుతోనే కొత్త లీజులు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. పాత లీజుల్ని రద్దు చేయకుండా కొనసాగించుకుంటూ వెళ్లడం భూములపై ప్రభుత్వమే యాజమాన్య హక్కుల్ని వదులుకున్నట్టు అవుతుందని హెచ్చరించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కమిషనర్ మధ్య లేఖలు నడిచినట్టు తెలుస్తోంది. అనూహ్యంగా కమిషనర్ నిబంధనల్లో సవరణలు చేయాలని కోరిన పదిహేను రోజుల్లోనే జీవో వెలువడటం వెనుక ఏం జరిగిందనేది ఆసక్తికరంగా మారింది.

# హడావిడి పనులే కారణం

# నివేదిక ఇచ్చిన త్రిసభ్య కమిటీ

**విశాఖపట్టణం, మే 6, పెన్ పవర్:** సింహాచలం అప్పన చందనోత్సవం సందర్భంగా జరిగిన ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. గత వారం సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో చందనోత్సవం సందర్భంగా స్వామి వారి నిజరూప దర్శనం కోసం వచ్చిన భక్తులపై గోడ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇరిగేషన్ ఇంజనీర్ చీఫ్ వెంకటేశ్వరరావు, ఐజీ ఆకే రవికృష్ణలతో కూడిన కమిటీ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సింహాచలం దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు త్రిసభ్య కమిటీ ఛైర్మన్ , పురపాలక శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ నివేదికను సమర్పించారు. ఏప్రిల్ 30 తేదీన చందనోత్సవం రోజు సింహాచలంలో భారీ వర్షానికి గోడ కూలిన దుర్ఘటనలో 7గురు భక్తుల మృతి చెందారు. చందనోత్సవానికి ముందు మాస్టర్ ప్లాన్‌లో లేని గోడను ఆలయ అధికారులు నిర్మించారు. కొండ ప్రాంతంలో ఎలాంటి పైల్ ఫౌండేషన్ లేకుండా రెండు అడుగుల వెడల్పుతో 70 అడుగుల పొడవున గోడను నిర్మించారు. తాత్కాలికంగా నిర్మించిన గోడకు పునాది కూడా లేదని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షం కారణంగా పెద్ద ఎత్తున నీరు, బురద చేరి బరువు కారణంగా గోడ కూలినట్టు కమిషన్ అభిప్రాయపడింది. గోడ దిగువకు నీరు వెళ్లేందుకు లీప్ హెూల్స్ కూడా లేవని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. చందనోత్సవానికి వారం రోజుల ముందు ఈ గోడను హడావిడిగా నిర్మించినట్టు నివేదికలో వివరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ లో భాగంగా గోడ నిర్మాణానికి హడావిడిగా అనుమతులిచ్చారని, దీనిపై ఎలాంటి డిజైన్లు లేవని వివరించారు. గోడ నిర్మాణానికి ఎలాంటి డిజైన్లు, కనీసం పునాది కూడా లేకుండా నిర్మించేశారని ప్రాథమిక నివేదికలో కమిషన్‌లో వివరించింది. గోడ పటిష్టత గురించి, భక్తుల భద్రత గురించి ఎలాంటి తనిఖీలు చేయలేదని కమిషన్ పేర్కొంది. విశాఖ సీపీ సహా వివిధ శాఖలకు చెందిన సాక్షుల నుంచి స్టేట్మెంట్లు నమోదు చేసిన త్రిసభ్య కమిటీ ఆలయ ఈఓ, ఇంజనీరింగ్ సిబ్బంది, టూరిజం కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్ లక్ష్మణ రావులు ప్రమాదానికి బాధ్యులని వీరందరిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

**మృతదేహాలపై బంగారం మాయం**

విశాఖపట్నంలో సింహాచలం అప్పన్న దేవస్థానంలో చందనోత్సవం రోజు (ఏప్రిల్ 30న) గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు చనిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారి మృతదేహాలపై బంగారం కనిపించడం లేదనే ఆరోపణలు వచ్చాయి. వారి ఒంటిపై ఉండాల్సిన బంగారం కనిపించకుండా పోయిందని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో విశాఖపట్నం పోలీసులు స్పందించారు. సింహాచలం చందనోత్సవం లో గోడ కూలి మృతి చెందిన మృతదేహాల పై ఉన్న బంగారం పోయింది అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని.. చనిపోయిన వారి ఆభరణాలు తమ బంధువులు స్వయంగా అప్పగించినట్లు తెలిపారు. తప్పుడు కథనాలు, సోషల్ మీడియా లో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, పైలా వెంకటరత్నం, గుజ్జరి మహాలక్ష్మి ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను సిమెంట్ రాళ్ల కింద నుంచి వెలికి తీసిన తర్వాత సింహాచలం ఘటన జరిగిన చోటి నుంచి అంబులెన్సుల్లో విశాఖపట్నంలోని %ఖ+ం%కు తరలించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం 2:30 గంటల కల్లా బంధువులకు అప్పగించారు. అయితే సింహాచలం ప్రమాదంలో చనిపోయిన పిళ్లా ఉమామహేశ్వరరావు కుటుంబానికి చెందిన బంగారం మాయమైందని ప్రచారం జరిగింది. భారీగా బంగారం కనిపించడం లేదని ప్రచారం జరుగుతోంది. దీంతో పోలీసులు స్పందించారు.. బంగారం అంశంపై క్లారిటీ ఇచ్చారు.

# ఇక రియల్ పరుగులేనా

**విజయవాడ, మే 6, పెన్ పవర్:** ఆంధ్రుల రాజధాని అమరావతి పునః ప్రారంభ పనులు షురూ అయ్యాయి. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన పనులను తిరిగి పట్టాలెక్కించే పనిలో ఏపీ ప్రభుత్వం పడింది. ఇందులో భాగంగా అమరావతి పునః ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఇందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. భారీ సభా వేదికపై నుంచి కీలకమైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునరుద్ధరణ సహా రాష్ట్ర పరిధిలో రూ.58,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ మే 2వ తేదీన శంకుస్థాపన చేశారు. అంతేకాదు రాజధాని నిర్మాణానికి పూర్తి మద్దతు ఉంటుందని హామీనిచ్చారు. అమరావతి అంటే కేవలం ఒక నగరం మాత్రమే కాదని%ౌ% ఒక శక్తి అంటూ వ్యాఖ్యానించారు. రాజధాని పనుల పునరుద్ధరణ పనుల నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వర్గాల్లో మళ్లీ ఆశలు చిగురుస్తున్నాయి. గత ఐదేళ్లలో పూర్తిగా డీలాపడిపోయిన పరిస్థితి ఉండగా%ౌ% ప్రస్తుతం పునర్ధరణ పనులు జరుగుతుండటంతో పెట్టుబడి పెట్టేందుకు చాలా మంది ఆసక్తి చూపే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు%ౌ% డెవలపర్ల, ఇన్వెస్టర్లలో అత్మవిశ్వాసాన్ని పెంచే దిశగా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. అమరావతి నిర్మాణం పునఃప్రారంభంలో భాగంగా అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు, జ్యుడీషియల్ రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణంతో పాటు 5,200 కుటుంబాలకు ఇళ్ల భవనాలు సహా రూ.49,000 కోట్ల విలువైన 74 ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. అమరావతి నగరం కల సాకారమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి పనులు%ౌ% ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని వేగవంతం చేస్తాయని చెప్పారుకీలకమైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడంతో ముఖ్యంగా అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం పునరుద్ధరణకు మంచి అవకాశాలు ఉన్నాయని క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బయన శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా డెవలపర్లు, ఇన్వెస్టర్లలో సెంటిమెంట్లో సానుకూల మార్పును గమనించామని ఆయన చెప్పారు. ముఖ్యంగా అమరావతి పనులు పట్టాలెక్కడంతో పాటు ప్రభుత్వం తరపున క్రియాశీలక భాగస్వామ్యం ఉండటంతో రియల్ ఎస్టేట్ మార్కెట్ లో స్పష్టత, విశ్వాసం పుంజుకున్నాయని చెప్పారుఅమరావతిలో పెట్టుబడి పెట్టాలంటే అంతకుముందు ఇన్వెస్టర్లలో అనిశ్చితి నెలకొని ఉండేది. ఇన్వెస్టర్లకు తమ పెట్టుబడులు పెరుగుతాయన్న భరోసా ఉండాలి. గతంలో లేకుండేది. ఇప్పుడిప్పుడే స్పష్టత వస్తోంది. పెట్టుబడిదారుల కార్యకలాపాలు పెరగడంతో వచ్చే ఆరు నెలల్లో భూముల ధరలు 15-20 శాతం పెరుగుతాయని ఆశించవచ్చు" అని శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ కు చెందిన కు చెందిన హను రెడ్డి రియల్టర్ జీవీ జగదీష్ ప్రకారం%ౌ%. "ఈ ప్రాంతంలో సగటు భూమి రేట్లు చదరపు గజానికి రూ .25,000 రూ .30,000 మధ్య ఉన్నాయి. నిర్మాణ ప్రాపర్టీ ధరలు చదరపు అడుగుకు రూ .4,000 వరకు ఉన్నాయి. స్థలాన్ని బట్టి భూముల ధరలు మారుతుంటాయి. శివార్లలోని వ్యవసాయ ప్లాట్ల ధర ఎకరానికి రూ.2-3 కోట్లుగా ఉంది. కీలకమైన గ్రోత్ కారిడార్ అయిన అమరావతి-గుంటూరు బెల్ట్ లో ప్రధాన భూమి ధర ఎకరాకు రూ.5-10 కోట్ల వరకు ఉంది" అని వివరించారు. "ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల భవిష్యత్తు ప్రభుత్వ నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది. అమరావతి కోసం ప్రభుత్వ సిద్ధం చేసిన రోడ్ మ్యాప్ ను స్థిరంగా అమలు చేస్తే పెట్టుబడి దారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది" అని అభిప్రాయపడ్డారు. 2014 లో రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని నిర్ణయించబడింది. యూకేకు చెందిన ప్రఖ్యాత సంస్థ ఫోస్టర్ అండ్ పార్ట్నర్స్ మాస్టర్ ప్లాన్ రూపొందించింది. విజయవాడ-గుంటూరు మధ్య 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సమగ్ర అభివృద్ధిని ప్రతిపాదించింది.

# 25 లక్షలకు బేరం కుదుర్చుకొని 2 లక్షలే ఇచ్చారు

# కత్తి పోటుకు ఓ రేటు...

## వీరయ్య చౌదరి హత్య కేసులో ట్విస్టులు

**ఒంగోలు, మే 6, పెన్ పవర్:** ప్రకాశం జిల్లా తెలుగుదేశంపార్టీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో అనేక ట్విస్ట్ లు వెలుగు చూస్తున్నాయి. గత నెల 22వ తేదీన వీరయ్య చౌదరి హత్య జరిగినప్పటికీ ఇప్పటి వరకూ నిందితుల అరెస్ట్ అనేది అధికారికంగా జరగకపోవడంపై టీడీపీ నేతలు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి, హెూంమంత్రి వచ్చి ఆదేశాలు ఇచ్చినా ఈ నిర్లక్ష్యమేంటని ప్రశ్నిస్తున్నారు. అయితే నిందితులు చాలా తెలివిగా వ్యవహరించి ఏ మాత్రం ఆధారాలు లభించకుండా తప్పించుకు వెళ్లారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కొందరు నిందితులు ఈ కేసులో వారంతట వారే పోలీసుల ఎదుట లొంగిపోయారని చెబుతున్నప్పటికీ ఇంకా అధికారికంగా పోలీసులు ప్రకటించలేదు. ఈ నెల 8వ తేదీన వీరయ్య చౌదరి పెద్ద కర్మ జరుగుతుందని, ఈ లోగానైనా అరెస్ట్ చేస్తారా? లేదా? అని సోషల్ మీడియాలో ప్రకాశం జిల్లా టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు హత్యకు సూత్ర ధారి ఎవరనేది తెలిసినా అతనని కూడా ఇంత వరకూ పట్టుకోక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దర్యాప్తు కొలిక్కి వస్తుందని పోలీసులు చెబుతున్నా ఆధారాలు లేకండా హడావిడిగా కేసును ముగించామని చెబితే అది రేపు న్యాయస్థానాల్లో నిలబడదని పోలీసు అధికారులు చెబుతున్నారు. అందుకోసమే వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులకు కఠిన శిక్షలు పడేలా తాము విచారించి, అందుకు అవసరమైన ఆధారాలను సేకరిస్తున్నామని చెబుతున్నారు. మరొక వైపు వీరయ్య చౌదరి లో నిందితుల కోసం గాలిస్తున్న పోలీసు బృందాలను కూడా ఎప్పటికప్పుడు మారుస్తూ విషయాలు బయటకు పొక్కకుండా పోలీసు ఉన్నతాధికారుల చర్యలు తీసుకుంటున్నారు. లేకుంటే నిందితులు జాగ్రత్త పడతారని భావిస్తున్నారు. తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఈ కేసులో కీలక సూత్రధారి వినోద్ కు సురేష్ ఇరవై ఐదు లక్షల రూపాయలు చెల్లించడాని, అయితే సుపారీ గ్యాంగ్ కు మాత్రం వినోద్ ఇప్పటి వరకూ రెండు లక్షలు మాత్రమే చెల్లించారని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మరో కీలకమైన నిందితుడు పరారీలో ఉన్నాడని, అతను దొరికితే కాని ఆధారాలతో పాటు వాంగ్మూలం కూడా లభించదనిచెబుతున్నారు. పోటు పోటుకు ఇంత మొత్తం చెల్లిస్తామని చెప్పడంతోనే వీరయ్య చౌదరిని దారుణంగా హత్య చేశారని తర్వాత సుపారీ గ్యాంగ్ కు రెండులక్షలతోనే సరిపెట్టారన్న వార్తలు వస్తున్నాయి. మరి పోలీసు అధికారులు అజ్ఞాతంలోకి వెళ్లిన నిందితులను బయటకు తీసుకు వచ్చి విచారణ చేస్తే తప్ప అసలు వాస్తవాలు బయటకు రావని అంటున్నారు.

# మూడేళ్ల ముందు టిక్కెట్లా...

**అనంతపురం, మే 6, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అభ్యర్థుల ఎంపికలో ప్రయోగాలకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. శింగనమల నియోజకవర్గంలో వైసీపీ ఎప్పుడూ స్ట్రాంగ్ గా ఉంటుంది. అయితే గత ఎన్నికల్లో జగన్ అతి విశ్వాసంతో చేసిన ప్రయోగం వికటించింది. అది టీడీపీకి వరంగా మారింది. 2019 ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఎన్నికయ్యారు. అయితే ఆమెకు 2024 టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించారు. శింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల్లో తలెత్తిన విభేదాల కారణంగా జొన్నలగడ్డ పద్మావతిని పక్కన పెట్టాల్సి వచ్చింది. అదే సమయంలో 2024 ఎన్నికల్లో ఆమెను కాదని శింగనమల నియోజకవర్గం టిక్కెట్ ను వీరాంజనేయులుకు ఇచ్చారు. ఆయన టిప్పర్ డ్రైవర్ గా ఉన్నప్పటికీ జగన్ తన బొమ్మతో నైనా వీరాంజనేయులు గెలుస్తారన్న నమ్మకంతో టిక్కెట్ ఇచ్చారు. వీరాంజనేయులు టిప్పర్ డ్రైవర్ అని, చంద్రబాబు ఏ టిప్పర్ డ్రైవర్ కైనా ఇచ్చాడా? అంటూ రాష్ట్రమంతటా ఎన్నికల ప్రచారంలో జగన్ పెద్దయెత్తున ప్రచారం చేశారు. తాను పేదల పక్షపాతినని, పార్టీ కోసం కష్టపడిన వారికి టిక్కెట్లు ఇస్తామని, అదే సమయంలో అన్ని సామాజికవర్గాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా డబ్బును చూడనని, కేవలం చట్ట సభలకు తీసుకెళ్లి వారి గొంతును వినిపించడమే లక్ష్యమని బిల్డప్ ఇచ్చారు. అయితే వీరాంజనేయులు గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిపై వైసీపీ అభ్యర్థి ఎం. వీరాంజనేయులు దాదాపు ఆరువేల పై చిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు వీరాంజనేయులు పార్టీ ని నియోజకవర్గంలో బలోపేతం చేయలేకపోతున్నారు. మరో పథకం జూన్ 12 గ్రాండ్ లాంచ్ శైలజానాథ్ కే టిక్కెట్... అయితే వీరాంజనేయులు స్థానంలో తిరిగి జొన్నలగడ్డ పద్మావతిని తీసుకువస్తారని భావించినా ఇప్పుడు కాంగ్రెస్ నుంచి సాకే శైలజానాథ్ పార్టీలో చేరడంతో ఆయనకు శింగనమల నియోజకవర్గం బాధ్యతలను అప్పగించారు. సాకే శైలజనాథ్ కు మంచి పేరు ఉంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేశారు. ఆయనకంటూ సొంత వర్గం అంటూ ఉంది. అందుకే జొన్నలగడ్డను, వీరాంజనేయులును పక్కనపెట్టి వచ్చే ఎన్నికల్లో సాకే శైలజానాథ్ కు టిక్కెట్ హామీ జగన్ ఇచ్చేశారంటున్నారు. ఆయనైతే గెలుపు సులువవుతుందన్న నమ్మకంతో జగన్ శైలజానాథ్ కు పార్టీలో కూడా కీలక బాధ్యతలను అప్పగించే యోచనలో ఉన్నారంటున్నారు. ఇక అనేక నియోజకవర్గాల్లో ప్రయోగాలకు దూరంగా ఉండాలని జగన్ డిసైడ్ అయినట్లు తెలిసింది. పాత నేతలతో పాటు నియోజకవర్గాల్లో క్యాడర్ తో టచ్ లో ఉన్న నేతలకు అక్కడే టిక్కెట్లు ఇవ్వాలన్న యోచనలో ఉన్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తన బొమ్మ పనిచేయదని భావించిన జగన్ నియోజకవర్గాల వారీగా ముందు నుంచే అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఎన్నికలకు మూడేళ్లకు ముందుగానే ప్రకటిస్తే జనంలోకి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయగలరన్న విశ్వాసంతో జగన్ ఉన్నారు. శింగనమల వంటి నియోజకవర్గాలు మాత్రమే కాకుండా గత ఎన్నికల్లో నియోజకవర్గాలు మారచిన వారిని కూడా వారి పాత స్థానాలకు పంపేయోచనలో జగన్ ఉన్నారని తెలిసింది.

## హెట్ మేయర్‌పై వేటు.. ఇంగ్లాండ్, ఐర్లాండ్ సిరీస్‌లకు వెస్టిండీస్ జట్టు ప్రకటన




**హైదరాబాద్ పెన్ పవర్:** మే 21 నుంచి ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లకు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు మంగళవారం (మే 6) తమ జట్టును ప్రకటించింది. దక్షిణాఫ్రికాలో జరగబోయే 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని విండీస్ క్రికెట్ బోర్డు ఇప్పటి నుంచే మంచి జట్టును సిద్ధం చేసే పనిలో ఉంది. ఈ స్క్వాడ్ లో భాగంగా ఎక్కువగా కుర్రాలకే అవకాశం కల్పించింది. షాయ్ హోప్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. 18 ఏళ్ల జ్యువెల్ ఆండ్రూ తిరిగి విండీస్ జట్టులో స్థాన సంపాదించాడు. వన్డే అరంగేట్రంలోనే సెంచరీ చేసిన అమీర్ జాంగూ కూడా జట్టులోకి వచ్చాడు. ఈ స్క్వాడ్ లో ఆశ్చర్యకరంగా విండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్మైర్ పేరు లేదు. హెట్మైర్ ఇటీవలే పేలవ ఫామ్ లో ఉండడమే దీనికి కారణం. గత కొంతకాలంగా ఈ పవర్ హిట్టర్ ఫామ్ దిగజారుతూ వస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ లోనూ ఘోరంగా విఫలమవుతున్నాడు. బ్రాండన్ కింగ్, ఎవిన్ లూయిస్ ఓపెనర్లుగా రావడం ఖాయంగా మారింది. కీసీ కార్టీ మూడో స్థానంలో ఆడే అవకాశం ఉంది. హోప్, రోస్టన్ చేజ్, జస్టిన్ గ్రీవ్స్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్ మిడిల్, లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ భారాన్ని మోయనున్నారు. అల్జారి జోసెఫ్ పేస్ అటాక్‌కు నాయకత్వం వహిస్తారు. షమర్ జోసెఫ్, మాథ్యూ ఫోర్డ్ ఫాస్ట్ బౌలర్లుగా ఎంపికయ్యారు. గుడాకేష్ మోటీ విండీస్ స్క్వాడ్ లో ఏకైక ఫ్రంట్‌లైన్ స్పిన్నర్.

ఐర్లాండ్ పర్యటన మే 21న ప్రారంభమవుతుంది. మే 23, 25 తేదీల్లో వరుసగా రెండు, మూడు వన్డేలు జరగనున్నాయి. మే 29 నుండి జూన్ 2 వరకు ఇంగ్లాండ్‌లో మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డేలు ముగిసిన తర్వాత ఇంగ్లాండ్ తో వెస్టిండీస్ వెస్టిండీస్ ఐదు టీ20 మ్యాచ్ లు ఆడనుంది. ప్రస్తుతం ఐపీఎల్ ఆడుతున్న రూథర్‌ఫోర్డ్, షెపర్డ్ త్వరలోనే విండీస్ జట్టులో చేరనున్నారు. కెప్టెన్ హోప్, జోసెఫ్ పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడుతున్నారు. ఈ లీగ్ మే 18 నాటికి పూర్తవుతుంది.

**వెస్టిండీస్ వన్డే జట్టు:**
షాయ్ హోప్ (కెప్టెన్), జ్యువెల్ ఆండ్రూ, కీసీ కార్టీ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, జస్టిన్ గ్రీవ్స్, అమీర్ జాంగూ, అల్జారి జోసెఫ్, షమర్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, ఎవిన్ లూయిస్, గుడకేష్ మోటీ, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, జేడెన్ సీల్స్, రొమారియో షెపర్డ్

## ఐపీఎల్ 2025: వదులుకున్నోళ్లు.. అదరగొడుతున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ కొత్త సీజన్ ఆరంభం అవుతుంటే.. వేలం కంటే ముందు ఆటగాళ్లను అట్టిపెట్టుకునే ప్రక్రియ జరుగుతుంది. అందులో కొందరు ఆటగాళ్లను ఎంచుకుని మిగతా వాళ్లను వదిలేస్తుంటారు. కొందరు ఆటగాళ్లు తమకు తాముగా వేలంలోకి వెళ్తుంటారు. అలా ఈ సీజన్‌లో వేరే జట్లకు వెళ్లిన ఆటగాళ్లు దాదాపు అందరూ అదరగొడుతున్నారు.




### బట్లర్‌ని వదలుకుని...

తమ ఆటగాళ్లను వదులుకున్నందుకు ఇప్పుడు అత్యంత విచారం వ్యక్తం చేయాల్సిన స్థితిలో ఉన్న జట్టు ఏదంటే రాజస్థాన్ రాయల్స్ అనే చెప్పాలి. రిటెన్షన్ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోక ఎక్కువ నష్టపోయింది ఆ జట్టే అని చెప్పాలి. ఎన్నో ఏళ్ల పాటు రాజస్థాన్ రాయల్స్‌లో అంతర్భాగంగా ఉంటూ ప్రతి సీజన్లో నిలకడగా రాణించిన ఆటగాడు జోస్ బట్లర్ . తన ఓపెనింగ్ భాగస్వాములుగా ఎవరున్నా సరే.. ఒక ఎండ్‌లో బట్లర్ అదరగొట్టేవాడు. అవసరానికి తగ్గట్లు కొన్నిసార్లు అతను మూడో స్థానంలో కూడా ఆడి రాణించాడు. గత సీజన్లో కూడా రాజస్థాన్ తరఫున 11 మ్యాచ్‌లు ఆడి రెండు శతకాలు సహా 359 పరుగులు సాధించాడు. అయినా అతణ్ని వదిలేసిందా జట్టు. ఈ సీజన్లో గుజరాత్ టైటాన్స్ సొంతమైన బట్లర్.. అద్భుత బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. గత సీజన్లను మించిన నిలకడతో 10 మ్యాచ్‌ల్లో 78.33 సగటుతో 470 పరుగులు చేశాడు. ఓపెనింగ్‌లో శుభ్‌మన్ గిల్, సుదర్శన్ బలమైన పునాది వేస్తుంటే.. తర్వాత బట్లర్ అందుకుంటున్నాడు. ఈ సీజన్లో గుజరాత్ నిలకడగా టాప్-3లో కొనసాగుతోందంటే అందులో బట్లర్ పాత్ర కీలకం. రాజస్థాన్ తరఫున పెద్దగా ఆకట్టుకోలేకపోయిన దేవ్‌దత్ పడిక్కల్ సైతం బెంగళూరు తరఫున నిలకడగా రాణిస్తున్నాడు. అతను భారీ స్కోర్లు చేయకపోయినా కొన్ని విలువైన ఇన్నింగ్స్‌లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. పడిక్కల్ 10 మ్యాచ్‌ల్లో 247 పరుగులు సాధించాడు.

### ఇటు బౌల్ట్.. అటు చాహల్

ఇక గత సీజన్ వరకు రాజస్థాన్‌తో ఉండి మళ్లీ తన పాత జట్టు ముంబయికి వచ్చేసిన పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ సైతం గొప్పగా బౌలింగ్ చేస్తున్నాడు. ఈ సీజన్లో అతను 11 మ్యాచ్‌ల్లో 21 సగటుతో 16 వికెట్లు పడగొట్టి టాప్ బౌలర్ల లిస్టులో కొనసాగుతున్నాడు. ముంబయి మళ్లీ బౌలింగ్‌లో బలం పుంజుకోవడానికి బౌల్టే ప్రధాన కారణం. రాజస్థాన్ తరఫున కూడా అతను మెరుగైన ప్రదర్శనే చేశాడు కానీ.. ముంబయి జట్టులోకి వచ్చాక పతాక స్థాయిని అందుకున్నాడు. రాయల్స్ జట్టులో చాలా ఏళ్ల పాటు కీలక బౌలర్‌గా ఉన్న యుజ్వేంద్ర చాహల్ సైతం ఈ సీజన్లో ఆ జట్టుకు దూరమయ్యాడు. పంజాబ్ అతణ్ని ఎంచుకుంది. అతను వేలంలో రూ.18 కోట్ల రేటు పలికాడు. ఆరంభ మ్యాచ్‌ల్లో చాహల్ అంత గొప్పగా రాణించలేదు కానీ.. సీజన్ మధ్యలో పిచ్‌లు మారడంతో మళ్లీ తన స్పిన్ మాయాజాలం చూస్తున్నాం. కోల్‌కతాతో స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో 4 వికెట్లతో అదరగొట్టి జట్టును గెలిపించాడు. చెన్నైపై ఏకంగా హ్యాట్రిక్ సహా ఒకే ఓవర్లో నాలుగు వికెట్లు తీశాడు. ఆర్సీబీపైనా జట్టుకు విజయాన్నందించాడు.

### అతడి రాకతో అద్భుతం

పంజాబ్ జట్టు కూడా మరో టీం నుంచి వచ్చిన ఆటగాడి వల్ల బాగా ప్రయోజనం పొందింది. అతనెవరో కాదు.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ . గత సీజన్లో అతను కోల్‌కతాకు కప్పు అందించాడు. కానీ మేనేజ్మెంట్‌తో విభేదాలు వచ్చాయా.. లేక ఎక్కువ రేటు కోసం వేలంలోకి వచ్చాడా తెలియదు కానీ.. రూ.26.75 కోట్ల భారీ రేటుకు పంజాబ్ సొంతమైన శ్రేయస్.. ఆ రేటుకు పూర్తి న్యాయం చేస్తున్నాడు. శ్రేయస్ కెప్టెన్ కావడంతో పంజాబ్ ఆట ఒక్కసారిగా మారిపోయింది. గత 11 ఏళ్లలో సాధ్యం కాని విధంగా 14కు మించి పాయింట్లు సాధించి.. ప్లేఆఫ్స్ దిశగా దూసుకెళ్తోంది పంజాబ్. బ్యాటర్‌గా అదరగొడుతూ, కెప్టెన్‌గా జట్టును సమర్థంగా నడిపిస్తూ పంజాబ్ రాత మార్చేశాడు శ్రేయస్. ఈ సీజన్లో ఇప్పటికే అతను 400కు పైగా పరుగులు సాధించాడు. అందులో నాలుగు అర్ధశతకాలున్నాయి.

### సాల్ట్.. అలవాటైన ఆటతో...

కోల్‌కతా మిస్ చేసుకున్న మరో ఆటగాడు ఫిల్ సాల్ట్ కేకేఆర్‌కు ఓపెనింగ్‌లో బలమైన ఆటగాడిగా ఉంటూ గత ఏడాది కప్పు గెలవడంలో కీలకంగా మారిన సాల్ట్.. ఈసారి బెంగళూరుకు మారాడు. అటు కోల్‌కతా ఓపెనింగ్‌లో బలహీనపడగా.. ఇటు ఆర్సీబీ ఆ విషయంలో బలపడింది. కోహ్లితో కలిసి జట్టుకు కొన్ని మ్యాచ్‌ల్లో చక్కటి ఆరంభాలిచ్చాడు సాల్ట్. కొంచెం ఆచితూచి ఆడే కోహ్లికి.. సాల్ట్ రూపంలో దూకుడైన భాగస్వామి దొరకడంతో ఆ జట్టుకు ఓపెనింగ్‌లో తిరుగులేకపోయింది. సాల్ట్ మరీ పెద్ద స్కోర్లు చేయకపోయినా దూకుడైన ఆటతో జట్టుకు ఉపయోగపడ్డాడు. 9 మ్యాచ్‌ల్లో 239 పరుగులు చేసిన సాల్ట్.. గాయంతో కొన్ని మ్యాచ్‌ల నుంచి ఆడట్లేదు.

### కేఎల్.. కసిగా

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను మూడు సీజన్ల పాటు కెప్టెన్‌గా నడిపించాడు కేఎల్ రాహుల్ . తొలి రెండు సీజన్లలో ఆ జట్టు ప్లేఆఫ్స్ కూడా చేరింది. కానీ గత సీజన్లో లీగ్ దశలో నిష్క్రమించింది. ఐతే బ్యాటర్‌గా కేఎల్ మూడు సీజన్లలోనూ సత్తా చాటాడు. గత సీజన్లో మాత్రం జట్టును ముందుకు తీసుకెళ్లలేకపోయాడు. ఐతే సన్‌రైజర్స్‌తో ఒక మ్యాచ్‌లో జట్టు తేలిపోయినందుకు బహిరంగంగా మైదానంలో అందరి ముందూ రాహుల్‌ను తిట్టాడు యజమాని సంజయ్ గోయెంకా. అది తీవ్ర వివాదాస్పదమైంది. కట్ చేస్తే ఈ సీజన్‌కు లఖ్‌నవూను వదిలేశాడు కేఎల్. దిల్లీ అతణ్ని ఎంచుకుంది. కెప్టెన్సీ ఇస్తామన్నా అతనే వద్దనుకున్నాడు. బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా జట్టుకు పెద్ద బలంగా మారాడు. ఎంతో కసిగా ఆడుతూ 9 మ్యాచ్‌ల్లో అతను 371 పరుగులు సాధిచాడు. కొన్ని సీజన్ల నుంచి తడబడుతున్న దిల్లీ.. ఈ సీజన్ తొలి అర్ధభాగంలో దిల్లీ టాప్‌లో దూసుకెళ్లడానికి కేఎల్‌యే ప్రధాన కారణం. ఆ జట్టు ప్లేఆఫ్స్ చేరేలాగే కనిపిస్తోంది.

### వీళ్లు కూడా...

గత సీజన్లలో లఖ్‌నవూకు ఆడి.. ఇప్పుడు మరో జట్టు తరఫున సత్తా చాటుతున్న మరో ఆటగాడు కృనాల్ పాండ్య అతను ఆర్సీబీకి ఈ సీజన్లో పెద్ద బలంగా మారాడు. కొన్ని మ్యాచ్‌ల్లో బంతితో సత్తా చాటిన అతను.. దిల్లీపై బ్యాటింగ్‌లోనూ చెలరేగి 73 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు.

ఫిల్ సాల్ట్ రాకతో లాభపడ్డ ఆర్సీబీ.. విల్ జాక్స్ ను దూరం చేసుకుని కొంచెం నష్టపోయింది. అతను ముంబయి జట్టులో బ్యాటుతో బంతితో సత్తా చాటుతున్నాడు. 142 పరుగులు చేయడంతో పాటు 5 వికెట్లు తీశాడు. రెండు మ్యాచ్‌ల్లో ముంబయి విజయానికి తోడ్పడ్డాడు. సన్‌రైజర్స్ తరఫున పెద్దగా రాణించని మార్క్రమ్ ప్రస్తుతం లఖ్‌నవూ తరఫున ఆల్‌రౌండ్ ప్రదర్శన (346 పరుగులు, 6 వికెట్లు)తో అదరగొడుతున్నాడు. అబ్దుల్ సమద్ (160 పరుగులు) సైతం కొన్ని విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. బెంగళూరు తరఫున భువనేశ్వర్ (12 వికెట్లు) కూడా నిలకడగా రాణిస్తున్నాడు. గతంలో సన్‌రైజర్స్‌కు ప్రాతినిధ్యం వహించి ఇప్పుడు పంజాబ్‌కు ఆడుతున్న యాన్సెన్ (11 వికెట్లు) సైతం స్థిరంగా సత్తా చాటుతున్నాడు.



ప్రగ్యా జైస్వాల్ తన అందమైన యుగంలో మెరుస్తోంది

## ఎవరికీ తెలియని విషయాలను వెల్లడించిన బచ్చన్ పాప



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న కింగ్‌డమ్ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. తాను హీరోయిన్ అవాలని డిసైడైనప్పుడు పాటలు వింటూ సీన్స్ ను ఊహించుకునేదాన్నని ఎవరికీ తెలియని విషయాన్ని బయటపెట్టింది బచ్చన్ పాప. తాను ఆ పాటలు వినేటప్పుడే తనక్కూడా ఒక రోజు వస్తుందని, ఆ రోజు తనకంటూ సొంత పాటలుంటాయని, కేవలం బీజీఎం మాత్రమే కాకుండా పాటలకు కూడా తాను ప్రాణం పోస్తానని తనకు తెలుసని చెప్పిన తనకు తాను కలలు కనడం లేదని కూడా అప్పుడే తెలుసని, తానేంటో తనకు తెలుసని చెప్పిన భాగ్యశ్రీ హృదయం లోపల లాంటి సాంగ్ ఇచ్చినందుకు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ కు థాంక్స్ తెలిపింది. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ పై షూట్ చేసిన ఈ సాంగ్ రీసెంట్ గా రిలీజై అందరి నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. మరీ ముఖ్యంగా సాంగ్ మధ్యలో ఇద్దరి మధ్య వచ్చే డైలాగ్స్ ఆడియన్స్ కు సినిమా కథ గురించి కీలక వివరాలను తెలిసేలా చేస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతుంది. ఈ సాంగ్ మొదట్లో విజయ్ దేవరకొండ పేరు సూరి అని, అతను, భాగ్యశ్రీ లవర్స్ గా నటిస్తున్నారని అర్థమవుతుంది. అయితే వీరిద్దరూ ఏదో పెద్ద మిషన్ కోసం కలిసి ఉన్నట్టు తెలుస్తోంది కానీ ఆ మిషన్ ఏంటనేది మాత్రం తెలియడం లేదు. ఈ సినిమాలో భాగ్యశ్రీ ఓ డాక్టర్ గా కనిపించగా, సూరి జనాలను చంపే బిజినెస్ లో ఉన్నట్టు తెలుస్తోంది. ఇద్దరూ ఒంటరిగా ఉన్నప్పుడు నిరంతరం దూరంగా ఉంటారు కానీ సాంగ్ అయిపోయే టైమ్ కు ఈ జంట ఒకరినొకరు ప్రేమించుకున్నట్టు అనిపిస్తుంది. అనిరుధ్ సంగీతం అందించిన ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, అనిరుధ్, అనుమిత పాటను పాడారు. మే 30న రిలీజ్ కానున్న ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో నాగ వంశీ నిర్మిస్తున్నాడు. ఈ సినిమాపై నిర్మాత నాగవంశీ, హీరో విజయ్ దేవరకొండ ఎంతో కాన్ఫిడెంట్ గా ఉన్నారు.



పాతకాలపు చీరలో ఈషా రెబ్బా పాతకాలపు వైబ్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com